# స్త్రీకి విముక్తి ఎప్పుడు?

వెల : రూ. 2/-

పబ్లిషర్సు :

సమతా పబ్లికేషన్సు

మ్యూజియం రోడ్డు :: విజయవాడ-2.

C16714

25636

# మారలేదు - మహిళ జీవితం

—మోటూరు ఉదయం

యుగాలు మారినా
జగాలు మారినా
మారలేదు మహిళగాథ
తీరలేదు ఆమె బాధ

బ్రతుకిచ్చిన మాతృమూర్తికి
సుఖమిచ్చిన గృహలక్ష్మికి
పురుషు లిచ్చిన ముఖప్రీతికి
నిర్వచనాలు సవాలక్ష !!
మరుగునున్నది మహాకక్ష
పరిశీలించు చెల్లీ !
పరిశోధించు తల్లీ !

నీతికి నీవు నిలబడ్తే
నిజమేదో నిరూపిస్తా

అవయవ నిర్మాణం
అంగికాభినయం
అది ప్రకృతి సహజం

జగమెరిగిన సత్యానికి
భగవంతుని పేరెందుకు ?

సమాన పనికి - వ్యత్యాసం
సమాన ఆస్తికి వ్యతిరేకం
ఈ వావపు పరమార్ధం
మన సంఘపు చావస్త్రం
యీ గీతలు చెరిపేస్తే
యీ జగతికి కలదు సుఖం !

# స్త్రీకి విముక్తి ఎప్పుడు ?

—పి. మమత

స్త్రీ పురుషులు సమానులని చట్టం ఘోషించింది. అయితే సమాజం ఇంకా యీ వాస్తవాన్ని అంగీకరించలేదు.

చట్ట ప్రకారం అన్నివిధాలా రక్షణలు వున్నప్పటికీ యీ దేశ స్త్రీ ఇప్పటికీ రెండవ శ్రేణి పౌరసత్వాన్ని అనుభవిస్తూంది.

విడివిడిగా స్త్రీ జీవిత పరిస్థితి చూస్తే చాలా భయంకరంగా కన్పిస్తూంది. సామూహికంగా స్త్రీ స్థితి తీసుకుందాం.

మన భారతీయ సమాజం - సాంప్రదాయకమైన పురుష ఆధిక్య సమాజమని నిస్సందేహంగా చెప్పవచ్చు.

యీ నాటికీ మన వివాహ వ్యవస్థకు అర్థం "కొంగున పాలు - కను కొలకుల్లో నీరు" అని - స్త్రీ త్యాగానికీ - బలిదానానికీ ప్రతీతి మాత్రమే. త్యాగం - బలిదానం వంటి శబ్దాలు యీ నాటికీ భారతీయ మహిళను ప్రలోభపెట్టే ఆకర్షణలుగానే యున్నాయి.

యీ నాటికీ స్త్రీకి భర్తే దైవం - భర్తమాట బ్రహ్మవాక్కు" - భర్త ఆజ్ఞ దైవాజ్ఞ అనే ధోరణిలోనే యున్నారు.

కొద్దిమంది పట్టణాలలోయున్న విద్యావంతులైన యువతులు భర్తలతో సమానంగా వ్యవహరించితే వ్యవహరించవచ్చు. మొత్తంమీద మన సమాజంలో "భార్య" యొక్క స్థితి "బానిస స్థితే". అంతకంటే మరోకటి లేదు.

బానిస స్థితి అంటే - వీరికి హృదయాలుండవు - మనస్సు ఉండవు - బుద్ధి వుండదు - దెబ్బలు కొడితే వారి శరీరాలకు తాకవు. చదువుకున్నవారికి యీ విషయం బాధ గలిగించవచ్చు.

కానీ యీ నాటికీ మనదేశంలో దాదాపు 100 కి 75 కుటుంబాలలో స్త్రీలను కొట్టడం మామూలుగానే సాగుతుందని సెన్సెస్‌తీపి చెప్పారు.

సమాజంలో అతి నిస్సహాయ స్థితిలో వున్నది - ఆడవాళ్ళు - పిల్లలు అని "చలం"గారు ఏనాడో చెప్పారు.

దానికి పేదవారినిగూడా చేరిస్తే ఎంతమంది అభాగ్యులు యీ సమాజంలో వున్నారో బోధపడుతుంది.

ఎటు చూసినా యీ భారతదేశంలో తరతరాలుగా స్త్రీ "బానిసకు బానిసగానే కన్పడుతుంది." ఆస్తిలేని పురుషుడికి ఆస్తిగానే నిలబడింది. అంటే ఆమె కేవలం సంతానాన్ని ఉత్పత్తి చేయడం. అతని అహంకార పూరితమైన కోరికలు తీర్చుటకు ఆయన సొంత ఆస్తిగా భావించబడుతుంది.

మనం ఎంతో పవిత్రంగా ఎంచబడుతున్న - గ్రంధాలు - మతాలు - సైతం స్త్రీని చిన్నచూపు చూస్తూ క్షమించరాని నేరం చేస్తున్నాయి.

ఏ మతంలోనైనా చూడండి. కొద్ది వచ్చినక్తే ఆ భావాలు కన్పడుతాయి. హిందూ, ముస్లిం, క్రైస్తు మతాలలో చూద్దాం.

క్రిస్టమతంలో :- పాపానికి కారణం స్త్రీ అని చెప్పబడింది. యీ మతం ప్రకారం, భగవంతుడు, పురుషుడ్ని ముందు సృష్టించాడు. అతనికి ఉపచారం చేయ దానికి, అతని సంతోషపెట్టేందుకు మాత్రమే స్త్రీని సృష్టించాడట. అంటే ఆ భగవం తుడికి గూడా స్త్రీ అంటే ఎంత పక్షపాతం ?

పవిత్రమైన ఆ బైబిలులో ఇలా వ్రాసి యుంది.

"పవిత్రమైన "చర్చిలో" స్త్రీ ప్రసంగించుట - మాట్లాడుట-సిగ్గుమాలినపనిగా చిత్రించబడినది. ఆ గ్రంధం ప్రకారం, ఆమె ప్రోద్బలం మూలంగానే మానివునికి ఇన్ని కష్టాలు వచ్చాయని తేల్చారు.

మరి యీ స్త్రీ సృష్టికి కారకురాలే కాకపోతే యీనాడు యీ మతాధికారులు ఎక్కడుండేవారు ? అది మర్చిపోయారు పాపం.

హిందూమతం :- హిందూమతంలో గూడా ఇలా స్త్రీని అవమానపర్చడంలో ఏమాత్రం తీసిపోలేదు. అలాంటి శాసనాలు, ఆచారాలు సంఘంలో ప్రవేశపెట్టారు, అమలుపరిచారు.

సహగమనం - శిశు వివాహాలు - వితంతువుల పెళ్ళినిషేదం పీటిద్వారా తీరని అన్యాయం చేశారు స్త్రీలకు.

యీ మతాధిపతులు గూడా హిందూ స్త్రీని పాపాల మూటగా చిత్రించి ఆడ పిల్ల పుట్టిందంటే, చేసిన పాపాలకు ప్రతిఫలంగా పుట్టిందనే భావించేవారు. తాను ఏమాత్రం కారణంకానట్లు భార్యను చిత్రహింసలకు గురిచేయబడిన కథలు ఎన్నో మన చరిత్రలో అపురూపంలో లిఖించబడ్డాయి.

మనం ఎంతో పవిత్రంగా పూజించుకుంటున్న రామాయణ, భారతాలు చూద్దాం ఇందులోనూ అలాంటి నీచభావాలే స్త్రీలంటే చొప్పించారు.

గొప్ప చరిత్ర కలవాడిగా పేరు పొందిన రఘువంశ "కిరీటి" తనతోపాటు కష్టాలు అనుభవించిన భార్యను ఒక చిన్న కారణానికి అమెను విడనాడారు. నిజంగా స్త్రీ అంటే పవిత్ర గౌరమున్నదని ఒకవైపు చెబుతూనే ఇలాంటి అన్యాయాలు స్త్రీలకు కల్గిస్తున్నారు. అయితే ఆ నాడు అతను గొప్పగా కీర్తించబడ్డారు.

ఒక స్త్రీనిపండు వలిచి పంచినట్లుగా ఐదుగురికి పంచి మగవాడి దాహానికి స్త్రీని బలిచేశారు.

పవిత్రమైన "గీత"లో సైతం స్త్రీలు - సూద్రులు - పాపంయొక్క గర్భము నందు జన్మించినవారు అని చెప్పబడుతున్నది. (9-12) (9-32) మరి యీ మహాను భావులకు గుర్తులేదు గాబోలు తాముగూడా ఆ స్త్రీ పాపగర్భమునందు జన్మించామని; మరి వీరిని మరింత పాపాత్ములనాలి మనం.

బుద్ధుడు సైతం పవిత్రమైన భగవన్ నామస్మరణకు స్త్రీ పనికిరాదని నిరాకరిం చేడు. అలాగే, "మనుస్మృతి" పవిత్ర గ్రంథంగా చూస్తాం. అందులో ఏముంది. దాని నిండా స్త్రీని ద్వేషించిన సమాచారమే.

వాటిలో కొన్ని

1. "స్త్రీ అనేది, చిన్నతనంలో - తండ్రిచే, యుక్తవయస్సులో - భర్తచే, వృద్ధాప్యంలో పుత్రుడుచే రక్షించబడాలిగాని, స్త్రీ ఎపుడూ స్వతంత్రంగా జీవించరాదు.

2. స్త్రీ తన అందాన్ని గురించి, తన వయస్సుగురించి, శ్రద్ధ తీసుకోకూడదు. "అవి కేవలం పురుషుడికి మాత్రమే హక్కు" (9/14)

3. స్త్రీ తన ఇంటిలో సైతం స్వతంత్రంగా ఇష్టము వచ్చిన వారితో గడపటం, నిషిద్ధం. (5/147)

4. "స్త్రీ" - తుచ్ఛమైన కోరికలు - ఉగ్రకోపం - మోసము - ద్వేషము- అసూయ - చెడు నడత మూర్తీభవించిన స్వరూపం. (9/17) (ఎంత ఘోరంగా వ్రాశాడో ఆలోచించండి).

మను తర్వాత "కౌటిల్యుడు" తను రచించిన చాణుక్య "నీతి దర్పణి"లో
1. స్త్రీలు నిజాయితీలేనివారు - చెడగొట్టువారు - అత్యాశగలవారు - క్రూరమైన స్వభావం గలవారు. (2/1)

2. స్త్రీలు విశ్వాసం లేనివారు. (16/2)

హిందూ మతంలో కౌటిల్యుడు తర్వాత శంకరాచార్యుడు మరీ చెప్పుకోదగ్గ వాడు. యీయన "స్త్రీలు నరకానికి సింహద్వారము వంటివార"న్నాడు.

ఇస్లాం మతం స్త్రీలని జంతువులతోను, దున్నే పొలముతోను పోల్చబడింది. వారి స్త్రీలకు "పరదా తగిలించి ప్రపంచ ముఖం చూడకుండా కట్టుదిట్టం చేశారు. యీ మతం ప్రకారం - స్త్రీ స్వేచ్ఛ కలిగివుండుట - స్వేచ్ఛగా చదువుట. అభిప్రాయాలు చెప్పుట - సమాజంలో తానూ ఒక వ్యక్తిగా పాల్గొనుట క్షమించరాని నేరము.

భక్తులకు కొదవలేని భారతదేశంలో నూటికి 90 మంది భక్తులు స్త్రీలే. అయితే అక్కడగూడా స్త్రీలు అవమానింపబడ్డారు.

"కబీరు" అనే మహాభక్తుడు "స్త్రీ అన్ని పాపాలకు కారణం - ఆమె పురుషుణ్ణి గుడ్డివాడ్ని చేస్తుంది" అని తెల్చేశాడు. ఇంకో భక్తుడు "తులసీదాస్" ఇంకొక అడుగువేసి తన "రామచరిత్రలో" "స్త్రీ" "జంతువుతో సమానమని, కనుక ఆమెను కొట్టి హింసించవచ్చుని" ఆయన తన నిర్ణయం తెలిపాడు.

స్త్రీలు పూర్వం వేదాలు చదువుటగూడా సహించలేక పోయేవారు.

స్త్రీని పవిత్రమైన "అప్పు"తో - పవిత్రమైన భూమితోపోల్చి, ఆ భావాలనే సమాజంలో అమలు జరిపించారు.

రాజారామమోహనరాయి - వీరేశలింగంలాంటి మహామహాషులు - సంఘ సంస్కర్తలు స్త్రీ అధోగతికి బాధపడి ఆమెను ఉద్ధరించేందుకు వారి జీవితాలను అంకితంచేసి కృషిచేశారు.

రాజారామమోహనరాయి తన అన్న చనిపోతే, వదినగారు అన్న చితిపై కూర్చుంటే ఆమెను లాగాబోయాడు. ఆమె "నన్ను పుణ్యలోకాలకుపోనీమని గోల పెట్టి, లవిడ మూఢ ప్రాతివ్రత్యంతో నిలువునా కాలిపోయింది.

బయట స్వేచ్ఛా ప్రపంచం వుందని గ్రహించలేని వ్యక్తి, బయటకురావాలనే తహతహ వారికుండదు. పైగా బయటకొస్తే ఏచిక్కుల్లో ఇరుక్కుంటామోనని భయం.

తరతరాలుగా-తన ఇల్లు- సంసారం తప్ప బయట ప్రపంచం, నాగరికత, శాస్త్ర విజ్ఞానం ఎరుగని మహిళ అదే మూసలో మలచబడ్డ స్త్రీ సహజంగా వ్యక్తిత్వం సామాజిక స్పృహ కోల్పోతుంది. తనను బంధించి వుంచుతున్న ఆచారాలను సాంప్రదాయాలను తన జీవితాదర్శంగా భావించి వాటిని అభిమానిస్తూ సాంప్రదాయపు సంకెళ్ళు వదలవుతున్నాయేమోఅని , తనే ఇంకా బిగిస్తుంది.

ఏ అభివృద్ధి భావాలుగల యువతో వాటిని ఛేదించబోతే ఆమెను, దుమ్మెత్తి పోస్తుంది. అందుకే స్త్రీ విమోచనానికి తోటి స్త్రీయే బద్ధశత్రువవుతున్నది.

ఒక ఇంగ్లీషు రచయిత్రి "స్త్రీ" జీవితాన్ని గురించి ఇలా వ్రాశారు.

"చరిత్ర పేజీలు తిరగేస్తే ఆడవాళ్ళని గురించి తెలిపేది శూన్యం.

మన తాత ముత్తాతలు ఫలానా ఉద్యోగాలు చేశారనో, గొప్పపనులు చేశారనో, సంస్కరణలు చేశారనో వారివారి ప్రత్యేకతల గురించి చరిత్ర ద్వారా మనకి తెలుస్తుంది.

కానీ మన అమ్మమ్మలు, తాతమ్మలు గురించి మనకేమి తెలుస్తుంది ?

"వాళ్ళ సాంప్రదాయాలు తప్ప - ఫలానా ఆవిడ ఇంత అందంగా వుండేదనీ, మరో ఆవిడకి ఎంతో పొడవైన జుట్టు వుండేదనీ, ఆవిడ కవలపిల్లల్ని కన్నదని" అదే చరిత్ర. ఆడవాళ్ళకి ప్రత్యేకంగా ఏ శాస్త్రం గురించీ తెలియదు. స్త్రీలు అజ్ఞానులని అర్థం.

అవును మరి. ఒక్కొక్క శాస్త్రం గురించి, దాని మూల పురుషుని గురించి, దానిని అభివృద్ధి పరిచిన మహనీయుల గురించి చెప్పుకోడానికి చరిత్ర వుంది. మన స్త్రీలకి ఏముంది ?

అలాటి అజ్ఞానంలోనున్న దౌర్భాగ్యం మనది.

అయితే దానివెనుక స్త్రీ అణగారిన చరిత్ర మాత్రం చెప్పదు.

మనదేశంలో ఒక స్త్రీ పెద్ద విద్యావంతురాలు గావాలన్నా, ఉన్నత విద్యల్లో ప్రవీణులు గావాలన్నా - చాలా కష్టం. తమకున్న అడ్డంకులన్నింటినీ అధిగమించి, ఏటికి ఎదురీదితేగాని, ఆ స్త్రీ రాణించలేని స్థితిలో వున్నాము.

నేను స్వయంగా విన్న విషయం - ఒక వైద్య విద్య చదివిన మేధావి, పెద్ద డాక్టరు అమె అన్న విషయాలు.

"మీరు ఎన్నయినా చెప్పండి - మన దేశంలో ఆడది - మగవాడి నీడన హాయిగా బ్రతుకుతోంది. పాశ్చాత్య దేశాలలో యీ భద్రత భరోసా - ఏది? అని తృప్తిపడుతూ తోటి స్త్రీలతో చెబుతుంటే-నాకు నవ్వాలో ; ఏడవాలో అర్థంగాలేదు.

ఎవరి వ్యక్తిత్వం వాళ్ళకుంటే వాళ్ళ కష్టసుఖాలకు బాధ్యత వారిదే.

ఒకరిమీద మరొకరు పరాన్నభుక్కులలా ఆధారపడట మెందుకు?

యీ ఆధారపడటాన్ని "రక్షణ"గా భావించే చైతన్యమే మనకు మిగిలింది.

భార్య తన ఆస్తి గనుక దాన్ని భద్రంగా కాపాడాలని భావిస్తారేగాని అమెకూ-అభిరుచులూ - వుంటాయని, వాటికి అవకాశమివ్వాలని అనుకోరు. పైగా అమె స్వతంత్రించి ఏమన్నా చెయ్యబోతే "ఇలా చేయడం" మా ఇంటా - వంటా లేదని కశ్మెర చేస్తారు యీ సమాజంలో.

తన దయాదాక్షిణ్యాలపై ఆధారపడుతూ "యీ చీరె కొని పెట్టండి-ఆ గొలుసు చేయించి పెట్టండి" అని దేవిరిస్తుంటే - చక్కగా అని తిరుస్తూ - "తమ కారునో - కుక్కపిల్లనో ప్రదర్శించుతున్నట్లు - పిండి బొమ్మలా తయారయిన భార్యని తన వెనుక తీసుకుపోయి, అందరికి పరిచయం చేయడం, హోదాగానూ, గౌరవంగానూ సాగిపోతున్న సాంప్రదాయం - నేటి సమాజం.

ఎన్నో అవకతవకలున్న యీ వివాహ వ్యవస్థలో - వ్యభిచారం చోటు చేసుకుంది.

పూర్వం దేవదాశీలుగా - పెళ్ళిలేకండా, దేవాలయల్లో నృత్యాలుచేస్తూ, జీవనం గడుపుతుండేవారు. అట్టి వారిని, ఆ నిర్వాహకులు, పూజారులు, త్యాగంగా వారిని ప్రోత్సహించి, దైవం పేరుతో వారిని మత్తులోదించి వ్యభిచరించేలా చేసి, వ్యభిచారులుగా తయారుచేసి వుపయోగించుకున్నారు.

యీ దౌర్భాగ్య ఆర్థిక దుస్థితితో జీవనాధారానికి దిక్కుతోచక, దారిలేక ఇదొక వృత్తి గావడం మరింత దౌర్భాగ్యం, దురదృష్టం.

స్త్రీ చరిత్ర వ్రాయవల్సివస్తే - ఇంతటి నికృష్టపు అధ్యాయం మరొకటి వుండదు. స్త్రీ అవయవాల పొందిక మాత్రమే ఆవిడ ఆస్తి అయితే అది పెట్టుబడి గావడం - ఎంతో అవమానకరం.

మగవారిని సంతృప్తిపరిచే సాధనంగా మాత్రమే నేటి స్త్రీ జీవితం.

— అందుకే - అన్నారు —

కరుణేషు దాసీ

శయనేషు రంభా

క్షమయా - ధరిత్రి - అని స్త్రీ ఏ వేళలలో ఎలా వుండాలో శాస్త్రాలు రూపొందించి, స్త్రీలను అమాయకులుగాచేసి, అవి ఆచరణలో పెట్టి తృప్తిపడ్డారు.

పూర్వం కొన్నిదేశాలలో స్త్రీని అర్ధనగ్నంగా నిల్చోబెట్టి - అంగ అంగాన్ని-వర్ణిస్తూ వేలం వేసేవారట.

మానవ నాగరికత పెరిగిందనుకున్న యీ రోజుల్లోగూడా స్త్రీ పరిస్థితి ఇంత కంటే మెరుగ్గాలేదు.

సినిమాల్లోను - క్లబ్బుల్లోనూ - నగ్న ప్రదర్శనలిచ్చే దౌర్భాగ్యం పూసి పోనంతవరకు - వ్యాపార అభివృద్ధికి స్త్రీ వంపు సొంపులు - వుపయోగించే శక్తులు నాశనం గానంతవరకు - స్త్రీ స్వాతంత్ర్యానికి అర్ధంలేదు.

మహిళాభ్యుదయం ఎంతో ముందు కెళుతుందని, రేడియోల్లో - పత్రికలలో పెద్ద మనుష్యులు చెప్పే మాటలు వట్టి బూటకం. ఇవన్నీ అంతమొందితేతప్ప స్త్రీని గౌరవించే భావాలు పెరగవు. స్త్రీకి విముక్తిలేదు. యీ అభ్యుదయం అర అంగుళం ముందుకు వెళ్ళదు.

ఉన్నత మధ్య తరగతి స్త్రీ సమస్యలకు, అట్టడుగు తరగతి స్త్రీల సమస్య లకు చాలా తేడా లున్నాయి. అయితే సమాజంలోని సాంప్రదాయాలు పాటకజనాన్ని తాకకుండా వూరుకోవు'

పగలల్లా పొలాల్లో - మోకాటి నీళ్ళల్లో - బురదలో రెక్కలు ముక్కలు చేసుకునే వ్యవసాయ కూలీ స్త్రీ - అలాగే ప్రొద్దుటే తెల్లవారు ఝామునలేచి-బిడ్డల్ని భర్తని సంసారందిద్ది ఫ్యాక్టరీకో - పరిశ్రమలకో పరుగెత్తే స్త్రీలు - ప్రొద్దునపోయి సాయంత్రానికి - పిల్లలేమైనారో - మళ్ళా వంట - వార్పూ ఇంచెడు చాకిరి చేసు కోవాలనే ఆ వేదనతో ఇంటికి తిరిగివచ్చే స్త్రీలు - వారితోపాటే భర్తలు పనిచేసిన ఆయన కూలి డబ్బులు, అయన స్వేచ్ఛగా, త్రాగి. ఇంటికొచ్చి భార్యను అవమాన

వసుస్తారు. తప్పితే ఇంటి బాధ్యత, పిల్లల విషయంలో ఆ పురుషుడు శ్రద్ధతీసుకోడు. ఆ డ్యూటీ ఆడదానిదే అన్నట్లు వదిలేస్తున్నారు.

అలాగే చదువుకున్న యువతి కాలేజీల్లోనూ - కార్యాలయాల్లోనూ ప్రొద్దుట నుండి సాయంత్రందాకా పనిచేసి అలిసిపోయి, బిడ్డల విషయం; ఇంటెడు చాకిరీ వూహించుకుంటూ ఇల్లు చేరుతుంది.

మధ్య తరగతికి చెందిన యీ పురుషుడూ ఇంటి సంగతి, పిల్లల విషయంలో బాధ్యత పాలుపంచుకోడు. అది ఆమె బాధ్యత అన్నట్లు కాలక్షేపంచేస్తూ, తన అధికారాన్ని చలాయిస్తాడేగాని స్త్రీ స్థితి అర్థం చేసుకుని సానుభూతి చూపేవారు చాలా తక్కువమంది వున్నారు.

యీ విషయంలో అటు కార్మిక స్త్రీ, ఇటు మధ్యతరగతి స్త్రీ ఒకే రకంగా బాధ పడుతుంది.

ఆడవాళ్ళకు ఇంటి చాకిరీ, బిడ్డల పెంపకం పెద్ద భారమైన సమస్య అయింది.

చట్టాలు మారినా - ఆస్తి వారసత్వపు హక్కుల్లో తోడ బుట్టిన వాడితో సమానంగా నిలొచ్చేదానికే అవకాశంలేదు నేటి స్త్రీకి.

సమాజంలో - నాగరికతలో - క్రమంగా ఎన్ని మార్పులొచ్చినా - మనిషిని మనిషి దోచుకోడంలోను - స్త్రీని అన్ని విధాల అణగద్రొక్కడంలోనూ ఏమార్పు లేదు.

వర్గ సంస్కృతిలో రూపాలు మారాయేగాని, పునాది మారలేదు. స్త్రీ కన్యగా తండ్రి ఆధీనంలో - గృహిణిగా భర్త అదుపులో - ఆఖరి దశలో కుమారుని పంచన పడివుండటం పవిత్ర ధర్మంగా హిందూ శాస్త్రాలు నిర్దేశించాయి.

యీ నాడు నాగరికత పొందాననుకుంటున్న స్త్రీ గూడా బహిరంగంగా ఆ ధర్మాన్నే ఆచరిస్తోంది.

చలంగారు వ్రాసినట్లు.... .... ....

"పూర్వం ఆడవాళ్ళు - పిడకలకీ - పాతివ్రత్యానికి దాసులైతే - యీ నవీన స్త్రీలు షోకులకి-సరదాలకి లొంగిపోతున్నారు." అది యదార్థం అనిపిస్తుంది.

అయితే యీ స్త్రీ ఇలా కావడానికి ఆవిడ బాధ్యత ఎంత అనేది మనం ఆలోచించాలి.

స్త్రీని యీ విధంగా నిస్సహాయురాలుగాచేసి ముక్కు తాడుగు యీడుస్తున్నట్లు తమ అభివృద్ధికి - స్త్రీయే అడ్డుపడుతోందని వాపోతారు పురుషులు.

కాని స్త్రీనిగూడా పురుషునితోపాటు సమాజ అభివృద్ధికి వినియోగించలేని వ్యవస్థలో మనం బ్రతుకుతున్నాం.

ఏ దశలోనయినా కష్టపడటానికి తప్ప - సమాజంలో - ఎలాంటి స్థానం - హక్కులు పొందేందుకు వీల్లేని స్థితిలో 100 కి 90 మంది పురుషులు - స్త్రీలు యీ సమాజంలో వున్నంతకాలం - సొంత ఆస్తిపై హక్కు పోనంతవరకు - ఎన్ని చట్టాలు - సంస్కరణలు చేసినా - యీ దౌర్భాగ్య స్థితిలో పెద్ద మార్పు వుండదు.

మనదేశ జనాభాలో 48.18 శాతం అంటే-26 కోట్ల 40 లక్షలు స్త్రీలున్నారు.

ఇందులో-21.36 కోట్లు గ్రామాలలోను, 5.4 కోట్లు పట్టణాల్లో నివశిస్తున్నారు.

26 కోట్ల 40 లక్షల స్త్రీలలో - 21 కోట్ల మంది స్త్రీలకి అక్షరజ్ఞానంలేదు.

26 కోట్ల 40 లక్షల మంది స్త్రీలలో 312 లక్షల మంది స్త్రీలు మాత్రమే పొలాల్లో - కర్మాగారాల్లో - గనులలో-కార్యాలయాలల్లో-కాలేజీల్లో పనిచేస్తున్నారు.

మిగిలిన 23 కోట్ల 28 లక్షల మంది స్త్రీలు ఏమి పనిచేయడం లేదు అంటే - వారి శ్రమశక్తి ఎంత వృధా అవుతున్నట్లు ?

ఏ దేశంలోనైనా సగం జనాభా మాత్రమే పనిచేస్తే - ఎన్ని వనరులున్నా- ముడి సరుకులున్నా - దేశంలో దరిద్రం తాండవించక తప్పదు.

పైగా వున్న సంపద ప్రయివేటు వ్యక్తుల చేతులలో చిక్కుపడిపోయింది. మనదేశ స్థితి ఇదీ !

ఇతర దేశాలలో స్త్రీలు ఎలా బ్రతుకుతున్నారో పరిశీలిద్దాం,

—నాజీ జర్మనీలో ఆర్య అహంకారానికీ, పురుష ఆధిక్యతతోడై "స్త్రీలు, ఇల్లు కదలగూడదు" అని హిట్లరు శాశించాడు.

కానీ ప్రపంచ యుద్ధం వచ్చేసరికి గత్యంతరంలేక ఆడవాళ్ళనిగూడా ఫ్యాక్టరీలలోను యుద్ధ రంగంలోనూ పనిచేసేందుకు నియమించాడు హిట్లరు. ఫాశిస్టుల దృష్టిలో "స్త్రీ" అంటే బిడ్డల గనే యంత్రమే.

అలాగే ఇటలీ ఫాశిస్టు నియంత ముసోలినీ – మగాడు మారణ యుద్ధం చేయడానికి – ఆడది పిల్లల్ని కనేందుకే" పుట్టా రన్నాడు.

ఇంగ్లండులాటి నాగరికదేశంలోగూడా "ఓటింగు హక్కు" స్త్రీలు ఎన్నో సంవత్సరాలు పోరాడితేగాని పొందలేకపోయారు.

"గ్లాడ్ స్టన్" లాంటి రాజకీయవేత్తగూడా స్త్రీల ఓటు హక్కుని తీవ్రంగా వ్యతిరేకించాడు.

ఈలోగా మొదటి ప్రపంచ యుద్ధంలో – యుద్ధ రంగానికి తినుబండారాలు – బట్టలూ సప్లయి చేయడంలోనూ – సైనికులుగా పనిచేయడంలోనూ, స్త్రీలు చాలా చురుగ్గా పాల్గొనటంతో వారి సేవా నిరతిని – త్యాగాన్ని ఆ "కన్సర్వేటివ్‌లు"గూడా గుర్తించక తప్పలేదు. అప్పుడే దయతో ఓటుహక్కు ప్రసాదించారు.

రాజ్యాంగ పరమైన ఓటు విషయంలో ఇంగ్లాండు వంటి నాగరిక దేశంలో గూడా పోరాడక తప్పలేదు.

వేసవి విడిదికి ప్రసిద్ధి గన్న – స్విట్జర్లాండు దేశంలో స్త్రీలకి ఓటుహక్కు 1974 లో వచ్చింది.

అంటే "ఏ దేశ చరిత్ర చూసినా స్త్రీకేమున్నది గర్వకారణం" అనిపిస్తుంది.

అమెరికా స్వాతంత్ర్యం పొందిన – (200 సం॥ నాడు) మొదట్లో అమెరికన్ అతివకూడా మనలాగే ఉదయం నుండీ రాత్రిదాకా గొడ్డుచాకిరీ చేసేది.

అమెరికాలో ఇప్పటి నడివయసు వాళ్ళు "మా అమ్మ గిన్నెలు తోమడం – రొట్టెలు కాల్చడం – బట్టలు ఉతకటం అన్నీ తనే తిప్పలు పడేది" అంటుంటారు.

ఆ తర్వాత – వాషింగ్ మిషన్లు, అంట్లు గిన్నెలు కడిగే మిషన్లు వచ్చి ఆడదాని పని సుళువు చేశాయి.

అందువల్ల సాంప్రదాయాన్ని కొంత వరకు ఎదిరించే చొరవ – తీరిక దొరికాయి.

కానీ స్త్రీ విలువలు పెరగలేదు. నీగ్రోలపట్ల, స్త్రీలపట్ల విచక్షణ చూపడంలో ఏ మాత్రం మార్పులేదు.

1940లో అమెరికాలో నీగ్రోల బానిసత్వానికి వ్యతిరేకంగా ఉద్యమము సాగుతున్నపుడు, తోటి మగవారితోపాటు నీగ్రో మహిళలు, అన్ని కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద పెద్ద సభలలో ఉపన్యాసలుచేసి, మంచి వక్తలుగా గూడా తయారయ్యారు.

1960లో గూడా శాంతి ఉద్యమాలలోను, ప్రజా సంఘాలలోనూ విరివిగా స్త్రీలు పాల్గొని వారి బాధ్యతలు నిర్వహించారు.

అయితే విచారం, నాయకులుగా పురుషులే చలామణి అవుతూ వారితో అంత కృషిచేసి బాధ్యతలను నిర్వహించిన వార్ని - సెక్రెటరీలుగానో వంట పనులు నిర్వహించేందుకో, అలాంటి బాధ్యతలే అప్పగించారు.

ఇప్పటికీ అమెరికాలో అన్ని వుద్యోగాలలోకి అర్హతలున్నా, ఆడవాళ్ళని తీసికోరు. తీసుకున్నా మగవారితోపాటు సమంగా జీతం ఏ మహిళ అందుకోలేదు ఆడది గనుకనే. ఆడ - మొగ తేడా, నలుపు - తెలుపు తేడా అమెరికాదేశంలో ఇంకా పోలేదు.

అమెరికా మహిళలకు ఓటింగ్ హక్కు 1920లో వచ్చింది.

చదువు, సంపద పుష్కలంగావున్న అమెరికాలోగూడా, స్త్రీ వైజ్ఞానికంగా ఎందుకు వెనుకబడింది? అక్కడ గూడా ఆడపిల్లలు పెళ్ళిళ్ళు కాగానే చదువు ఎందుకు మానేస్తారు? పురుషులతోపాటు సమాన హక్కులు లేకపోగా, షాపులలో సేల్సు గరల్సుగానూ, విమానాలలో ఎయిర్‌హోస్టెస్‌గానూ, క్లబ్‌లలో దిశమొల నాట్యగత్తెలుగానూ ఆడవాళ్ళు వుపయోగపడుతున్నారు.

తెలియని మన ప్రజలకి అమెరికాలో భోగ భాగ్యాల గురించి ఆ దేశంపై మోజు ఎక్కువైంది.

స్త్రీని అర్ధనగ్నంగా నృత్యం చేయించి ఆనందించే సంస్కృతిలో ఆడదాని విలువ ఏ పాటిది?

దీనిని "వ్యాపార నాగరికత" అన్నాడొక మహానుభావుడు. అది నిజం, దీనితో డబ్బుకితప్ప మరి దేనికీ విలువ వుండదు.

అందువల్ల స్త్రీ విలాస వస్తువుగా వుండి తీరుతుంది.

ధనస్వామ్య దేశాలన్నిటిలోని, నిరుపేదవర్గాల స్త్రీల పరిస్థితి, ప్రతిచోటా ఇలాగే వుంది.

అయితే ప్రపంచమంతటా అభాగ్యులస్థితి ఇలాగే వుందా ? బాగుపడే దారే లేదా ?

అంటే ప్రపంచంలో మూడవ వంతు జనాభా యీ పరిస్థితులకు అతీతంగా బ్రతుకుతున్నారు.

అదే సోషలిస్టు వ్యవస్థ సమాజ నాగరికత.

మార్క్స్ సామ్యవాద సిద్ధాంతాన్ని మొట్టమొదటిసారి ఆచరణలో పెట్టిన మహనీయుడు "లెనిన్"

"లెనిన్" స్త్రీ బానిసత్వాన్ని గురించి, శాస్త్రీయంగా ఆలోచించి పరిష్కారం సోషలిస్టు సమాజంలో మాత్రమే సాధ్యమవుతుందని చెప్పారు.

లెనిన్ మాటలలో

"ఇంతకాలం స్త్రీల స్థానం బానిసలతో సమానంగా వుంది. స్త్రీలు ఇంటికే కట్టివేయబడుతూ వచ్చారు. స్త్రీలు అనుభవిస్తున్న రకరకాల దోపిడీల మూలంలో, దెబ్బకొట్టాలని ఇంతవరకూ ఏ వ్యవస్థా ఏ ప్రభుత్వం — తలపెట్టలేదు,

"కారణం — ఆ దెబ్బ పవిత్రమైన స్వంత ఆస్తికి తగులుతుంది గనుక —

సోషలిజం ఒక్కటే స్త్రీలని అన్ని దోపిడీల నుంచీ రక్షించ గలుగుతుంది.

"స్త్రీలు సంపూర్ణంగా విమోచన పొందాలంటే — సమాజంలో స్త్రీ పురుషులు సమాన స్థాయిలో బ్రతకాలంటే — ఇంటి పనులన్నీ సమాజపరం చేసి తీరాలి.

"స్త్రీల శ్రమంతా ఎందుకూ పనికిరాని విలువలేని, చిల్లర పనులలో ధ్వంసమై పోతుంది. ఆ శ్రమ సామాజిక ఉత్పత్తి కార్యక్రమాలలో వినియోగపడితే — సోషలిస్టు సమాజం అత్యధిక బలంతో స్థిరపడుతోంది. వంట — భోజనం — పిల్లల పెంపకం — చదువు మొదలైన పనులలో ఎవరికివారు వ్యక్తిగత కుటుంబాలలో చేసుకోకుండా — సమాజంలో — సమిష్టిగా జరిగే కార్యాలుగా — విధులుగా — మార్చడానికి

మా "శ్రామిక పాలన హృదయపూర్వకంగా చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తుంది" అని లెనిన్ - 1917 లో అన్నారు. అలాగే చేసిచూపారు.

1917 విప్లవం నాటికి రష్యన్ మహిళలు 100 కి 87 మంది నిరక్షరాస్యులే. 1940 నాటికి నిరక్షరాస్యత పూర్తిగా తుడిచిపెట్టబడింది. సోవియట్ స్త్రీలు, ఆర్థిక రాజకీయ రంగాలన్నిటా పురుషులతోపాటు కృషి చేస్తున్నారు.

అక్కడ కాలం మారింది. మొగవాళ్ళు చేయగల పనులన్నింటినీ-ఆడవాళ్ళు చేస్తున్నారు. ఎవ్వరూ నిరక్షరాస్యులు లేరు. నిరుద్యోగం లేదు - ఇల్లు లేనివాళ్ళు కనిపించరు - ఆకలి ఆర్తనాదాలు వినిపించవు - బట్టలు లేనివాళ్ళు లేరు. మనిషిని మనిషి దోపిడీ చేయడంలేదు. మహిళను దోపిడీ చేయడము అదృశ్యమైంది. బండచాకిరీ సమాజమంతటికీ తప్పింది.

చెట్లు నరకడం - రాళ్ళు కొట్టడం - భూమి చదునుచేయడం - దున్నడం - దమ్ము చేయడం - పంట కోయడం - నూర్చడం - ధాన్యాన్ని మోయడం మొదలైన పనులన్నింటినీ యంత్రాలే చేస్తున్నాయి.

ఆ యంత్రాలు అందరివీ. అందరికొరకూ పని చేస్తున్నాయి. ఆస్తులు - ఆదాయాలు - కొందరి సొత్తుగాదు. అందరివీ. అందుకే ఇంటింటికీ గ్యాస్ స్టౌవుంది. ఊడ్చే యంత్రం - ఉతికే యంత్రం - పప్పులు, పచ్చళ్లుచేసే యంత్రాలు అన్ని ఇళ్ళకూ లభ్యమవుతున్నాయి. అందుకుతోడు ఆహార పదార్థాలు - టిన్నులలో, ప్యాకెట్లలో, దాదాపు అన్ని రకాలు రెడీమేడ్‌గా ఫ్యాక్టరీలలో తయారవుతున్నాయి. ఇంకా అన్నిచోట్లా అమరకపోయినా, దాదాపు అందుకోగల స్థితిలో వున్నాదు. సోవియట్ యూనియన్‌లో వంటపని ఎంతో సులువు.

ఒక్కొక్క సోషలిస్టు దేశాన్ని గురించి పరిశీలించినపుడుగాని మీరు ఇంకా ఎన్నో విషయాలు తెలుసుకోగలరు.

నేడు సోషలిస్టు దేశాలలో మహిళ వంటింటికి పరిమితమై లేదు. అన్ని రంగాలలోను పురుషునితోపాటు అన్నిటా పోటీ బడుతూ వ్యక్తిత్వంగల మనిషిగా మహిళ రూపొందింది.

ఆ దేశంలో బిడ్డల విషయం — ఇంట్లో తల్లిదండ్రులు లేనపుడల్లా ఏగొడవా లేకుండా, పిల్లల్ని చిన్నప్పటినుండీ సాకటానికి - చదువులు చెప్పటానికి కిండరు గార్డెనులు దగ్గరనుండి - శాస్త్రపరిజ్ఞానం కలిగించే కళాశాలలవరకూ ప్రభుత్వమే బాధ్యత వహిస్తుంది. మాతా-పిత లేవరూ - ఎవ్వరికీ భారంగాదు వాళ్ళ పెన్షన్లు వాళ్ళకే వస్తాయి.

రష్యాలో, గర్భిణీ స్త్రీలకి రెండు నెలలనుండి 5 నెలలవరకు జీతమిచ్చి - ప్రసవకాలపు శలవు లిస్తున్నారు ఎక్కువమంది బిడ్డల్నిగన్న తల్లికి బహుమతులు- సమాజంలో ప్రత్యేక గౌరవం గల్గిస్తూ, మామూలు జీతం ఇస్తూ, తక్కువ గంటలు పనే వుంటుంది ఆ తల్లికి. పిల్లలెక్కువైతే అదనపు సదుపాయాలూ - అలవెన్సులూ వుంటాయి.

అనారోగ్యమే అరుదు కాగా తాము ఆస్పత్రులకు వెళ్ళడంగాదు. ఆస్పత్రే తమ ఇంటికి వస్తుంది. బిడ్డ పుట్టింది లగాయితూ, లిస్టు వ్రాసుకొని దగ్గరలోవున్న ఆరోగ్య కేంద్రమే బాధ్యత తీసికుంటుంది. డాక్టర్లు, నర్సులు వచ్చి పరామర్శించి, మందులిచ్చి పోతుంటారు.

పని భారం, యాతి బాధలులేవు అక్కడ మహిళలకు. విశ్రాంతి విరామాలు బాగా లభ్యమవుతున్నాయి. విద్యా విజ్ఞానాల అభివృద్ధికి, వినోదాలకు అవకాశం ఏర్పడ్డది.

ప్రతి మనిషికి తన కుటుంబం, భద్రత పిల్లల భవిష్యత్ గురించి భయాందోళనలు వుండటంసహజం.

కానీ సోషలిస్టు సమాజంలో ఆ బాధ్యత ప్రభుత్వమే పూర్తిగా తీసుకుంటుంది. ఇక సొంత ఆస్తి గురించి ఆరాటం వెంపార్లాట ఎందుకుంటుంది? బ్రతకటానికి హామీ ఇచ్చే సామ్యవాద వ్యవస్థలో అందరూ నిస్సంకోచంగా సమాజాభివృద్ధికి కృషి చేసే వీలుంది.

## సోవియట్ యూనియన్ రాజ్యాంగ చట్టం

"సోవియట్ యూనియన్‌లో స్త్రీ పురుషులకు సమాన హక్కులున్నాయి. "స్త్రీలకు పురుషులతో సమానంగా విద్య, వివిధ రంగ, వృత్తి శిక్షణకు ప్రవేశమూ, ఉద్యోగం, జీతనాతాలు, ప్రొమోషన్ విషయంలోనూ, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక కార్యకలాపాల్లోనూ సమానావకాశాలివ్వటం ద్వారా, స్త్రీల కోసం ప్రత్యేక శ్రామిక, ఆరోగ్య రక్షణ చర్యలను తీసుకోవడం ద్వారా, తల్లులు పనిచేయడానికి వీలుకల్పించే పరిస్థితులను నెలకొల్పడం ద్వారా, గర్భవతులకు, తల్లులకు జీతంపై సెలవులూ, తదితర సౌకర్యాలు, చంటిపిల్ల తల్లులకు పనికాలాన్ని క్రమేణా తగ్గించడంతో సహా తల్లులకు, పిల్లలకు శాసన రక్షణా, భౌతిక - మానసిక, నైతికమైన అండదండ లివ్వటం ద్వారా ఈ హక్కులకు హామీ వుంది."

ఒక సమాజ ప్రజాస్వామిక తత్వానికి మహిళా విమోచనా స్థాయి కొలమానమని ఏంగెల్స్ అన్న సుప్రసిద్ధమైన మాటలు, శాస్త్రీయ కమ్యూనిస్టు సిద్ధాంత మాన

పతనేకాక, దాని దూరదృష్టినికూడ తెలియజేస్తున్నాయి. కార్మిక, కర్షక ప్రభుత్వ స్థాపనపై డిక్రీని ఆమోదించిన సోవియట్ రాజ్యం అవతరించిన తొట్టతొలి రోజునే ఇది రుజువయింది.

మహిళల పట్ల వివక్షను చూపే చట్టాలనన్నింటిని రద్దు చేశారు. సమాజంలో కుటుంబంలో పురుషులతో మహిళలు సమానులని ప్రకటించి డిక్రీలను ఆమోదించారు.

మానవజాతి చరిత్రలో మొట్టమొదటిసారిగా, సోవియట్ ప్రభుత్వం మాతృత్వాన్ని, సమాజంలో మహిళల ప్రధాన బాధ్యతల్లో ఒకటిగా గుర్తించింది. పనిని, తమ తమ ప్రత్యేక నైపుణ్యంతో, సామాజిక - రాజకీయ కార్యకలాపాలను మాతృత్వంతో జోడించడానికి మహిళలకు వీలుకలిగించే పరిస్థితులు సృష్టించడం ప్రభుత్వ విధానానికి సంబంధించిన విషయమైంది.

మహిళ సామాజిక విముక్తి, సమాజ, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పురోగతితోనూ, సోషలిస్టు సంబంధాల స్థాపనతోనూ ముడిపడివున్న జటిల క్రమమనేది అందరికీ ఎరుకే. దేశంలోని జాతీయ సరిహద్దు మండలాల్లో మహిళా విమోచనం ప్రత్యేకించి క్లిష్టమైన పని అయింది. ఇక్కడ ఇంకా మిగిలివున్న దోపిడీ తదితర అభివృద్ధి నిరోధక శక్తులు పురుషులతో స్త్రీ సమానతను వ్యతిరేకించాయి. ఈ సందర్భంలోవారు స్త్రీలను బెదరించారు. వారిని హత్యచేయడానికికూడా పాల్పడ్డారు. ఆనాడు మహిళల్లో ఆత్మాభిమానాన్ని, తమ శక్తిపై విశ్వాసాన్ని రేకెత్తించడం, చట్టాలను, అక్టోబరు విప్లవం తమకు ప్రసాదించిన హక్కులను, అవకాశాలను ఎలా వినియోగించుకోవాలో నేర్పడం అవసరమయిందనికూడా గుర్తుంచుకోవాలి.

మహిళ యొక్క కొత్త అంతఃప్రపంచం, ఆమె సర్వసాధారణ లక్షణమైన ఉన్నత పౌర ధర్మనిరతి, తన దేశ వ్యవహారాలన్నిటిలోనూ తాను భాగస్వామినన్న చైతన్యం రూపొందడం. సోవియట్ మహిళ గడచి వచ్చిన పథం మూలంగా సమకూరిన అతి ముఖ్య ఫలితాలని మన విశ్వాసం.

సామాజిక ఉత్పత్తిలో క్రియాశీలంగా పాల్గొనడం, స్త్రీ మనిషిగా తన ప్రాముఖ్యాన్ని మరింత ప్రస్ఫుటం చేసేందుకు తోడ్పడుతుంది. ఆమె వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేస్తుంది. కుటుంబంలోనూ, సమాజంలోనూ తన హోదాను పెంచుకొనేందుకు ఆమెకు వీలు కలిగిస్తుంది అని ప్రబోధించారు. అందువల్లనే ప్రస్తుత సోషలిస్టు సమాజ పరిస్థితుల్లో, స్త్రీ జీవిత విధానాన్ని గురించి విశ్లేషణకు, సామాజిక ఉత్పత్తిలో ఆమె పాత్రను ప్రాతిపదికగా చేస్తున్నారు.

సోవియట్ యూనియన్‌లో పనిచేయగలిగిన స్త్రీలలో 93 శాతానికి పైగా ఉద్యోగం చేస్తున్నారు లేదా, చదువుకొంటున్నారు.

ప్రగతిశీల ప్రజా సంఘాల సుదీర్ఘ పోరాటాల ఫలితంగా గత కొద్ది దశాబ్దాల్లో పలు పెట్టుబడిదారీ దేశాల్లో పురుషునితో స్త్రీ సమతను లాంఛనంగా గుర్తించే చట్టాలు చేయబడిన మాట నిజమే. కాని, పెట్టుబడిదారీ సమాజంలో కుటుంబంలో మహిళ వాస్తవ పరిస్థితి ఎలా ఉందంటే, ఆమెకు ఇచ్చిన హక్కులు మామూలుగా కాగితం పైనే ఉండిపోతున్నాయి. అక్కడ మహిళలు సర్వసాధారణంగా తక్కువ నైపుణ్యం అవసరమైన, తక్కువ వేతనాలు లభించే పనుల్లో ఉన్నారు. ఒకే పనికి పురుషునికన్న స్త్రీ పొందే జీతం తక్కువ. నిరుద్యోగం పెరిగినప్పుడు మొట్టమొదట పని నుండి తొలగింపబడేది స్త్రీలే.

సోవియట్ యూనియన్‌లో శ్రామిక మహిళల పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నమైనది సోవియట్ యూనియన్‌లో నిరుద్యోగ మనేదేలేదు కనుక, తమకు పని పోతుందనే భయం వీరికిలేదు. మహిళలు చేసే ఉద్యోగాల విషయంలో కూడా ప్రగతిశీలమైన మార్పులు వస్తున్నాయి. ఉత్పత్తికి సంబంధించిన ప్రముఖ ఇంజనీరింగ్, సాంకేతిక శాఖల్లో, యంత్ర నిర్మాణంలో, రసాయన పరిశ్రమలో విద్యుచ్ఛక్తి అభివృద్ధిలో, అంటే సాంకేతిక ప్రగతికి అగ్రభాగాన ఉన్న శాఖల్లో మహిళలు అధికాధికంగా పాల్గొంటున్నారు.

ఈ దేశంలో ఉన్నత, సెకండరీ ప్రత్యేక విద్య గల ప్రవీణుల్లో 59 శాతం మహిళలే. మొత్తం యింజనీర్లలో దాదాపు సగంమంది వారే. అయిదు లక్షల మంది సోవియట్ స్త్రీలు పారిశ్రామిక సంస్థల, ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాల మేనేజర్లుగా నిర్మాణ ప్రాజెక్టుల, సమిష్టి వ్యవసాయ క్షేత్రాల, పరిపాలక సంస్థల, శాఖల అధిపతులుగా పని చేస్తున్నారు.

శాస్త్ర రంగంలో పనిచేసే స్త్రీల సంఖ్య 1959–1970 మధ్యకాలంలో అంటే, కొద్ది కాలంలోనే ఆరు రెట్లు పెరిగింది. ఆ రంగంలో పనిచేసే మహిళల సంఖ్య, పురుషుల సంఖ్యకన్న సత్వరగతిలో పెరగడంవల్ల, శాస్త్రీయ పరిశోధకులలో వారి వాటా 40 శాతమయింది. పలు వృత్తులు ఒక విధంగా ఆడవారి వృత్తులయాయి. ఉదాహరణకు వైద్యులూ, అధ్యాపకులలో స్త్రీలు 70 శాతం ఉన్నారు. కాని, విద్యాబోధనా విషయంలో పిల్లలు, తరుణ వయస్కులపై సమరస ప్రభావం నెరపాలంటే పాఠశాలల్లో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు ఉభయులూ ఉండటం అవసరం. అందువల్ల పురుషులను కూడా ఈ వృత్తులకు ఆకర్షించడానికై బహువిధ చర్యలను తీసుకొంటున్నారు.

ఉన్నత విద్యాసంస్థల్లో చదువుకొనేవారిలో నేడు సగం మంది ఆడవారు. ఈ దేశంలో సిబ్బంది శిక్షణ విషయంలో రూపొందిన ప్రణాళికా విధానం మూలంగా, విద్యాసంస్థల నుండి పట్టాలు పొందిన అంతమందికీ కూడా, వారివారి ప్రత్యేక శాఖలను బట్టి వారివారి ప్రత్యేక నైపుణ్యాలను బట్టి, ఉద్యోగాలు లభిస్తాయన్న హామీ ఉంది.

ఇక్కడ స్త్రీ పురుషుల సమతను గురించిన సార్వత్రిక భావనను కొంత విపరించడం సముచితం ఈ సమస్యను పరిశీలించడంలో మనం గమనించేది స్త్రీ, పురుషుల హోదాకు సంబంధించిన అంశాల సంఖ్య ఉభయత్రా సమానంగా ఉందా లేదా అని కాదు; సమాజంలో స్త్రీ పురుషుల స్థితికి సంబంధించిన సామాజిక పర్యవసానాలు సమానంగా ఉన్నాయా లేదా అని. స్త్రీ పురుషుల సమతను గురించి మనం మాట్లాడుతున్నప్పుడు శ్రమ ఉత్పాదకతలో, చేసే పని పరిమాణం, పని గంటలు, పని పరిస్థితుల్లో స్త్రీ, పురుషునికి సమానంగా ఉండాలని కాదు మన భావం. మాతృత్వం ఒక అతిముఖ్య సామాజిక విధి అయినందువల్ల, ఒకానొక "అసమత"ను స్థాపించడం ద్వారా పురుషులతో స్త్రీ ఆచరణలో సమానమయ్యే స్థితికి మనం పురోగమిస్తున్నామని లెనిన్ అన్నమాటలను మనం దృష్టిలో ఉంచుకోవాలి. పని విషయంలో సోవియట్ మహిళలకు ఎన్నో ప్రత్యేక సదుపాయాలు ఇవ్వబడ్డాయి. నే నిక్కడ పేర్కొంటున్నది. పింఛన్ల చెల్లింపు, ప్రసూతి సెలవు ఇవ్వటం, ప్రసూత సెలవులోవున్న మహిళ కోసం ఆమె పనిని అట్టి పెట్టడం, పిల్లలకు పాలివ్వడంకోసం ఇచ్చే విరామ సమయాలకు వేతనం చెల్లించడం, పనిలోఉన్న గర్భవతుల రక్షణ కోసం ప్రత్యేక నియమాలను పాటించడం, శిశువుకు ఏడాది వయసు వచ్చేవరకు బిడ్డ ఆలనా పాలనకై తల్లికి సెలవు ఇవ్వడం మొదలయిన సౌకర్యాలు.

సోవియట్ రాజ్యాంగ చట్టం ముసాయిదాపై చర్చ సందర్భాలలో, చంటిపిల్ల తల్లుల పని గంటలను క్రమేణా తగ్గించాలన్న ఒక సవరణ. అందుకు సంబంధించిన నిబంధనలో చేర్చబడింది.

మహిళల ఆరోగ్యానికి హానికరమైన కొన్ని ఉత్పత్తి రంగాల్లో మహిళల నియామకాన్ని సోవియట్ యూనియన్‌లో పరిమితం చేశారు. లేదా పూర్తిగా నిషేధించారు.

ఇతర దేశాలతో స్నేహ సంబంధాల అభివృద్ధికై కృషిచేసే వివిధ సంఘాల కార్యకలాపాల్లో, ప్రత్యేకంగా సోవియట్ మహిళల కమిటీలో స్త్రీలు క్రియాశీలంగా పాల్గొంటున్నారు. సోవియట్ మహిళల కమిటీ నేడు, భారతదేశంతోసహా 120 దేశా

లోని 250 మహిళా సంఘాలతో స్నేహ, సహకార సంబంధా లుంచుకొన్నదని ఈ సందర్భంలో చెబితే చాలు.

ఒక స్త్రీ వ్యక్తిత్వం, సంపూర్ణతా, ఆమె ఉన్నత సామాజిక ప్రతిష్ఠ సామాజిక శ్రమలో, రాజకీయ, పౌర జీవితంలో పురుషునితో ఆమె సమానతతోనే కాక, కుటుంబ జీవితంలో ఆమె క్రియాశీల, నిర్మాణాత్మక భాగస్వామ్యంతోకూడ ముడి పడి ఉన్నాయి.

ఆర్థికంగా స్వతంత్రులూ, కుటుంబ సంబంధాల్లో పూర్తిగా సమానులూ అయిన స్త్రీ పురుషుల స్వచ్ఛంద దాంపత్యంపై, కొత్త సోషలిస్టు కుటుంబం నిర్మితమైంది.

ఉన్నత సాంస్కృతిక స్థాయిగల చదువుకొన్న తల్లి, ఆధునిక సమాజంలో పిల్లలను పెంచి పెద్దచేసే క్లిష్టమైన విధులను మరింత బాగా నిర్వర్తించగల దనేది స్పష్టమే. శ్రామిక, పౌర రంగాల్లో తమ తల్లి పాల్గొంటూండటం, ఆమె మానసిక దృక్పథం, వృత్తిలో సామర్థ్యం, పరిణతి, పౌర చైతన్యం - ఇవన్నీ పిల్లల దృష్టిలో ఆమె ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తాయి. వారు అడిగే "ఎందుకు?" అన్న వేలాది ప్రశ్నలకు సమగ్ర సమాధానా లివ్వడానికి తోడ్పడుతాయి.

సమాజంలో మహిళల కొత్త పాత్ర, కుటుంబంతో ఆమె ప్రతిపత్తిలో వచ్చిన మార్పు మూలంగా, తన కుటుంబంలోని ఇతర సభ్యుల అవసరాలను పూర్తిగానో, పాక్షికంగానో, తీర్చే ఇల్లాలుగా స్త్రీ అనాదిగా నిర్వహిస్తూ వచ్చిన మూసపోత పాత్ర నిర్మూలనమైంది. నేడు భార్య, తన భర్తతోపాటుగా ఇంటి వ్యవహారాలను నిర్వహిస్తూంది. పిల్లలను పెంచి పెద్ద చేస్తూంది.

"సోవియట్ యూనియన్‌లో స్త్రీలకు. పురుషులకు సమానహక్కు లున్నాయి" అని సోవియట్ రాజ్యాంగ చట్టం చెబుతూంది. ఈ దేశంలో 1917 అక్టోబరులో ప్రారంభమైన స్త్రీ పురుషుల సమత సుస్థాపితం కావడం నవ సమాజ వ్యవస్థ ఆవిష్కరించే అవకాశాలనూ, దాని జవసత్వాలను ప్రతిబింబించే ప్రగాఢ నిరంతరాయ క్రమం.

### చైనా విషయం చూద్దాం:

మొదట్లో చైనా దేశంలో స్త్రీల స్థితి చాలా హీనంగా వుండేది. ఆమె మనసువేగాదు పాదాలనుగూడా నొక్కి కట్టేసేవారు - మగ పిల్లల్ని కనలేని తల్లి ఎందుకూ పనికిరానట్లే లెక్క. చైనాలో మరొక విచిత్ర గాథ వుంది.

పెత్తిళ్ళల్లో పసివారిని వరుడుకిచ్చి పెళ్ళి చేస్తారు. "బాలభర్త"ని సాకుతూ ఆ తవారింట చాకిరీ చేస్తూ పడివుండాల్సిందే. యీ పసివాడు ఎప్పటికి ఎదిగి పెద్దవాడు కుంటాడా అనే ఆలోచనలతోనే ఆమె జీవితకాలం అయిపోతుండేది. ఆ కలలు గంటూ అక్కడ యువతుల కలత నిద్రలో ప్రక్కలోనున్న పసివాడు, కొడుకో - భర్తో ఒక్క నిముషం పోల్చుకోలేని దౌర్భాగ్యం అక్కడుండేది. వాడు కాస్తా గుటుక్కుమంటే. విధవరాలుగా ఆ అత్తింటిలోనే అందరికి చాకిరీ చేస్తూ క్రుంగు తుండేది.

పాతదైనా కథ ఒకటి చదివితే ఆనాటి స్త్రీ దౌర్భాగ్య స్థితి కళ్ళకు కడు తున్నట్లు కనిపిస్తుంది.

"ఒక పేదరైతు పేదరికంతో తన ఇల్లాలిని ఒక భూస్వామికి అద్దెకిస్తాడు. పిల్లలులేని ఆ భూస్వామి డబ్బు చెల్లించి పేదరైతు భార్యను తీసికెళతాడు.

ఆ పేదరైతు స్త్రీ తన పసి బిడ్డను వదలి బలవంతాన-భూస్వామి లాక్కెడు తుంటే, ఆ బిడ్డను వదలలేక పుట్టెడు దుఃఖంతో కసాయి కాలకు వెళ్ళే మేకపిల్లలాగా కన్నీటితోనే వెళుతుంది.

ఒక సంవత్సరకాలం యాంత్రికంగానే ఆభూస్వామితో కాపురంచేసి సంవత్స రానికి ఓ మగబిడ్డని కంటుంది. ఆ బిడ్డ పాలకోసం - మరో సంవత్సరం వుంచు కుంటాడు.

ఆ పేదరైతు భార్య తన ప్రథమ బిడ్డను తల్చుకుంటూ ఆరని కన్నీటితో 2 సంవత్సరాలు భారంగా జీవిస్తుంది ఆ పసి పిల్లాడికోసం భూస్వామి ఇంట్లో.

భూస్వామి భార్య మొగబిడ్డ నిచ్చిందని, ఎల్లగాలం వుంచుకుంటాడేమో తన భర్త అని పోరు పెట్టి ఇంట్లో నుండి వెళ్ళగొడ్తుంది.

అక్కడనుండి ఆ పసిబిడ్డను వదలలేక, మాతృ హృదయం వేదనతో - తొలి బిడ్డ ఎలా వున్నాడో చూచుకుందామని కన్నీటితోనే వడివడిగా తనవూరు చేరుతుంది. ఇంటికి రాగానే ఆ పసిబిడ్డ తల్లి పాలులేక - దరిద్రంతో పాలుకొని పోయలేనందున చనిపోయాడని తెల్సి ఆ తల్లి కుప్పకూలిపోయి రోదిస్తూ స్పృహతప్పి పడిపోతుంది. తన భార్యను అద్దెకివ్వటం వలన - తన దరిద్రం తీరనూలేదు. బంగారంలాంటి బిడ్డను చేతులారా చంపుకున్నాం అని - భార్య స్థితిజూసి కన్నీటితో కృంగిపోతాడు ఆ పేదరైతు. ఆమె ఇద్దరి బిడ్డలకూ తల్లిగాలేకపోయింది తన పేదరిం వల్ల.

ఇలాటి అభాగ్యులు సాంఘిక దురాచార రథచక్రాల క్రింద పుక్కాదట్రంలో పడి నలిబిలి అయిపోయేవారు.

బానిసత్వంలో మగ్గ దురాచారాలలో మునిగిన చైనా మనకు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతనే విప్లవం సాధించుకున్నది. సోషలిస్టు వ్యవస్థ నిర్మించుకుంది.

మన దేశంలోలాగే - తిండికోసం - చైనాలోగూడా ఎందరో అభాగినులు వేశ్యావృత్తిలో బ్రతికేవారు. ఒక్కొక్క నగరంలో కొన్ని వందల కంపెనీలుండేవి.

ఇపుడు నవ చైనాలో అభాగ్యులందరికీ - వారివారి అభిరుచులను బట్టి, విద్యా విజ్ఞానాలు గరిపి, ఉద్యోగాలిచ్చి, ఆ చీకటి కూపాన్నుంచి విముక్తి చూపారు.

పెత్తనం వదులుకోటం అషామాషీ వ్యవహారంకాదు.

నేడు స్త్రీ వదుపుగత్తె పునర్జన్మ పొంది సుఖంగా విలువుగా బ్రతుకుతోంది.

1937లో చైనా నాయకుడు "మావో" ఇలా అన్నారు.

"స్త్రీ, పురుషులు సమానులే. ప్రతి స్త్రీ పురుషుని వలెనే అన్ని పనులూ చేయగలదు" అన్నారు.

"స్త్రీలకు న్యాయరీత్యా సమానహక్కు లిస్తే చాలదు. మన ఆలోచనా విధానం సంస్కృతి - సాంప్రదాయం వీటన్నిటిలో మార్పు వస్తేగాని స్త్రీ స్థితిలో మార్పు రాద"న్నారు మావో.

ఏ పెత్తన మన్నా, చేతేతులా వదులుకోటం, మాటలయ్యే పనిగాదు-అందులో డబ్బుపై - ఆస్తి మీదా పెత్తనం వదులుకోటం అషామాషీ వ్యవహారం గాదు,

దానికోసం సోషలిస్టు దేశాలలో ఎంతో ప్రయత్నం, పోరాటం చేశారు. ఇంకా చేస్తున్నారు. సోషలిస్టు వ్యవస్థలో గూడా "హంస కాకి" అవగానే తెల్లవారే సరికి 'ఆడవాళ్ళు' అర్థడుగువాళ్ళ అందలాలెక్కపోలేదు. తరతరాలుగా జీర్ణమై పోయిన పాత భావాలు, ఆచారాలు, మూఢనమ్మకాలు, ఒక్క రోజులోనే పోలేదు. క్రమ పద్ధతిలో వాటినన్నిటినీ మార్చుకుంటూ పరిస్థితిని మెరుగు పరుస్తున్నారు. ప్రయివేటు ఆస్తి రద్దుచేసి సమాజపరం చేశారు, సోషలిస్టు దేశాలలో.

అలాంటి సమాన అవకాశాలు సద్వినియోగ మయ్యేలా చైనా ప్రభుత్వం, కృషిచేస్తుంది.

23686

ఒకప్పుడు చైనా ఇల్లాలు పిల్లల భవిష్యత్ గురించో, గ్యాస్ స్టౌవు గురించో, మంచి బట్టలు గురించో కలలు గనేది.

మరి ఇపుడో! వాటితోనే విముక్తి గంగదనీ గ్రహించి అంతకన్నా ముఖ్యమైన పనులుచేసి సమాజాన్ని అభివృద్ధి చేస్తున్నారు.

కొంతమంది గృహిణులు - మిల్లు కార్మికుల బిడ్డలను పెంచే కేంద్రాలలో పనిచేస్తుంటే - కొందరు, రేడియోలు తయారు చేస్తున్నారు. కొందరు ఆటవాళ్ళు బూట్లు కుడుతుంటే, మరికొందరు మహిళలు ఇళ్ళు కడుతున్నారు. వీధి వీధికి ఏదో ఒక వృత్తి కేంద్రం చైనా మహిళలే నడుపుతున్నారు.

ఇలా ప్రతి సోషలిస్టు దేశంలో మహిళలు పురోగమిస్తూ వారి భవిష్యత్తుతో, బిడ్డలు భవిష్యత్, దేశ భవిష్యత్ గూడా బంగారు బాటగా తీర్చి దిద్దుతుంటున్నారు.

అందుకే ప్రతి మహిళా ఆలోచించాలి. మనం వున్న స్థితినుండి - బయట పడేందుకు ప్రయత్నించాలి. అందుకు కృషిచేసే వుద్యమాలకు చేయూతనిచ్చి అండగా నిలవాలి. సాగే పోరాటంలో నిలబడి మన వంతు బాధ్యత పూర్తి చేసేందుకు పూనుకోవాలి.

మన స్థితి చూస్తే - ఒక వైపు ధరల భారం - హెచ్చుగా వుంది. మరో వైపు పనిలేదు - తిండి లేదు - యీ దరిద్ర భారతావని విముక్తి పొందడంమీదే మహిళా అభ్యుదయం ఆధారపడివుంది. ఆ విధంగా ఆలోచనతో మహిళలందరూ చైతన్యం పొందాలి. ప్రపంచ దృష్టిని అలవరచుకోవాలి. ఆ పెంచుకున్న విజ్ఞానాన్ని తోటి స్త్రీలకు పంచాలి. అలా మహిళలంతా తెల్సుకున్ననాడు, కార్యదీక్షతో కదలిన నాడే మనం, సోషలిస్టు సమాజం స్థాపించే - మన గమ్యం చేరగలం,

స్త్రీ ఇంటి చాకిరీ నుండి బయటపడి పురుషునితో సమాన అవకాశాలు కలిగి- సమాజిక అవసరమైన వుత్పత్తి కార్యక్రమాలలో పాల్గొన్న నాడే స్త్రీ నిజమైన విముక్తి పొంద గలుగుతుంది. అలాటి విమోచనకోసం, సోషలిస్టు దేశాల మహిళల ఆదర్శంతో - మనదేశంలోగూడా మనం కృషిచేస్తూ సాగిపోదాం. అందుకు మహిళా వుద్యమాలు బాగా కృషిచేయాలి.

# భయం విడువు - ముందు నడువు

—మోటూరు ఉదయం

మహిళగా – గృహిణిగా
ముందు నడువు
భయం విడువు
మరపించి – మురిపించి
అరమరలు సృష్టించి
అధికృతను జంపి
ఆధిపత్యమునుగూల్చి
మాతృమూర్తి చరిత
మలినపర్చిరి చూడు.
కాదు! కాదు!! ఇది న్యాయం!
కాదు। కాదు। ఇది ధర్మం!
ఈ చరిత్ర చింపివేయి!
ఇతివృత్తం మార్చివేయి!
కవయిత్రిగా - కళాభినేత్రిగా
కథ లెన్నో సృష్టిస్తూ
విధివ్రాతల నెదిరిస్తూ
కులమతాల కూల్చేస్తూ
కుళ్ళునంతా కడిగేస్తూ
వీరులకు తల్లిగా
ధీరులకు చెల్లిగా
ప్రజలే బలసంపదగా
నిజమే నీ నీతిగా
సమధర్మం స్థాపనకై
శాంతిని వెదజల్లుటకై
మహిళగా!
గృహిణిగా!
భయం విడువు!!!
ముందు నడువు!!!

# చట్టము - భారతీయ మహిళ

—జస్టిస్ ఓ. చిన్నప్పరెడ్డి

1975 అంతర్జాతీయ మహిళా సంవత్సరం. అది విశ్వమంతటా మహిళాభ్యున్నతికి అంకితం చేయబడింది. కొందరు తమ భార్యలను మనసావాచా అర్ధాంగులుగా పరిగణించినా యింకొందరు అంతకుమించి గౌరవించినా ఈ పురుష ప్రపంచంలో పురుషుల కున్నన్ని హక్కులు స్త్రీలకు లేవనేది నిర్వివాదాంశం. భారతీయ మహిళాభ్యున్నతికి కృషి చేయాలనుకున్నప్పుడు వివిధ చట్టాలతో భారతీయ మహిళా స్థానాన్ని అవగాహన చేసుకోవలసి వున్నది.

మన దేశంలోని మహిళల హక్కులు, స్థితిగతులు వారనుసరించే మతముమీద ఆధారపడి ఒక విధమైన ప్రత్యేకతను సంతరించుకున్నాయి. హిందూ, మహమ్మదీయ, క్రైస్తవ, పారశీక మతాలకు చెందిన స్త్రీల హక్కులు వారి మత సూత్రాలకు అనుగుణంగా భిన్నంగా వుంటాయి. భారతదేశపు కాన్స్టిట్యూషన్‌లోని 44వ ఆర్టికల్ దేశంలోని పౌరు లందరకూ ఒకే విధమైన సివిల్ కోడ్ రూపొందించాలని నిర్దేశించినా ఆ విషయంలో యింతవరకూ ఏ ప్రయత్నమూ జరగలేదు. దానికి కారణం మైనారిటీ వర్గాల కోర్కెలు, హక్కుల పరిరక్షణకు కావలసిన దానికంటె అధికమైన గౌరవమిస్తున్నట్లు భ్రమింప చేయటమే.

## కుమార్తెలకు ఆస్తి హక్కు

ఒక హిందువు పురుషుడైతే తాను జన్మించగానే సమిష్టి కుటుంబంలో ఆస్తికి హక్కుదారుడవుతాడు. అదే స్త్రీ అయితే అలా వీలులేదు. స్త్రీకి కేవలం తన పోషణకి, వివాహానికి సంబంధించిన వరకే హక్కు వున్నదిగాని తన సోదరునివలె సమిష్టి కుటుంబపు ఆస్తిలో వాటాకు హక్కులేదు. 1956 నాటి హిందూ వారసత్వ చట్టానికి పూర్వంవున్న చట్టం ప్రకారమైతే కుమార్తె తన సోదరులతోపాటు తన తండ్రి ఆస్తికి కూడ వారసురాలు అయ్యేందుకు వీలులేదు. 1956 నాటి హిందూ వారసత్వం అమల్లోకి రావటంతో ఆ సమస్య కొంత పరిష్కరింపబడి ఒక హిందువు మరణానంతరము విధవ పిల్లలు [పుత్రులు, పుత్రికలు] అతని ప్రత్యేక ఆస్తిని సమాన వాటాలలో పంచుకుంటారు. యిందులో పైకి కన్పించినంత న్యాయంగా పరిశీలించిచూస్తే కన్పించదు. ఎందుకంటే కుమారునికి పుట్టుకతోనే సమిష్టి కుటుంబంలో ఆస్తి పంచుకునే హక్కు లభిస్తుంది. కుమార్తెకు అది లభించదు. కుమార్తె కేవలం తన తండ్రి

వాటాలోనే. అదీ తిరిగి తన సోదరులు, తల్లితో పాటుగా ఆస్తిని సమానంగా పొందే హక్కును కలిగి వుంటుంది.

ఉదాహరణకు ఒక సమిష్టి కుటుంబంలో ఒక తండ్రి, ఒక తల్లి, యిద్దరు కుమారులు, యిద్దరు కుమార్తెలు వున్నారనుకోండి. వారికి 60 ఎకరాలు పొలం వుందనుకోండి. ఆ ఆస్తిలో తండ్రికి, కుమారులకు ఒక్కొక్కరికి 20 ఎకరాలపై హక్కుంది. తండ్రి మరణానంతరం కుమారులకు తమ వాటా 20 ఎకరాలతోపాటు తమ తండ్రి వాటాలోని 4 ఎకరాలు అదనంగా లభిస్తే కుమార్తెలకు, తల్లికి మాత్రం ఒక్కొక్కరికి నాలుగు ఎకరాలు మాత్రమే సంక్రమిస్తుంది. ఈ మాత్రపు దానికే ఈ చట్టం అమలులోకి వచ్చినప్పుడు హిందూ న్యాయశాస్త్రంలో స్త్రీ హక్కులు, "స్టేటస్" విషయంలో విప్లవాత్మక మార్పులు తీసుకొని రాబడినట్లు ఎంతగానో కొనియాడబడింది.

## హిందూ వారసత్వ చట్టము

హిందూ వారసత్వ చట్టములో పొందినంత గుర్తింపు అంతకుముందు పొందలేదన్నది వాస్తవమే. అయినా పైన వివరించిన ఉదాహరణలనుబట్టి చూస్తే స్త్రీలకు పురుషులతో హక్కు సమానంగా సంక్రమించలేదు. సమిష్టి కుటుంబంలోని ఆస్తిపై జన్మరీత్యా కుమార్తెలకు కూడ సమానమైన హక్కు వుండాలని చట్టం చేయటంలో కొన్ని యిబ్బందులు వున్నమాట వాస్తవమే. ఉదాహరణకు, కుమార్తెకు ఆ హక్కు కల్పించినట్లయితే తన ప్రాథమిక హక్కుకు ముప్పు వాటిల్లిందని కుమారుడు గోల పెట్టవచ్చు. అయినా ఆ గొడవ అంత శక్తివంతమైనది కాకపోవచ్చు లేదా ఆ యిబ్బంది అధిగమించ అలవికానిదేంకాదు. పోనీ అది చాలా యిబ్బందితో కూడుకున్న పని అని భావించినప్పటికీ కనీసం సమిష్టి కుటుంబంలోని తండ్రి వాటాకు హక్కుదారులు కేవలం విధవ భార్య, కుమార్తెలేనని తేల్చి, వారి హక్కులకు మెరుగులు దిద్దకూడదా? ఈవిధంగా చేస్తే సమిష్టి కుటుంబంలో కుమారులకున్న ఆస్తి హక్కుకు ఏవిధమైన ముప్పు వాటిల్లదు. పైగా ఆ మార్పులవల్ల కుమార్తెకు సంక్రమించిన ఆస్తి హక్కు, సమాజం ఆస్తి హక్కుకు మించి ఉండదుకదా? మరి మొదటగా దీనిని ఎందుకు అమలులోకి తీసుకురాకూడదు? నిజమే, వేరు స్వంతంగా తండ్రికి వున్న ఆస్తిపై కుమారులకు, కుమార్తెలకు సమానమైన హక్కు వున్నది. అయినా వ్యవసాయిక ప్రధానమయిన భారతదేశంలో కుటుంబంలో ఆస్తి సామాన్యంగా సమిష్టి రూపంలోనే వుంటుంది.

"స్టేటస్"లో కొనున్న ఆస్తి హక్కు విషయంలో హిందూ స్త్రీలకంటే మహమ్మదీయ స్త్రీలు కొంచెం మిన్న. ఒక మహమ్మదీయ పురుషుని మరణానంతరం

విధవకు ఆస్థిలో ఎనిమిదవ వంతు లభిస్తుంది. మిగతా ఆస్తిని కుమారులు, కుమార్తెలు పంచుకుంటారు. ఒక కుమార్తె ఆస్తి ఒక కుమారునకు వచ్చే ఆస్థిలో సగం మాత్రమే వుంటుంది. మొదటగా యిచ్చిన ఉదాహరణను యిక్కడ అన్వయించుకుంటే విధవకు 7 1/2 ఎకరాలు, ఒక్కొక్క కుమారునికి 17-1/2 ఎకరాలు, ఒక్కొక్క కుమార్తెకు 8 ఎకరాలు లభిస్తుంది. కేంద్ర ప్రభుత్వాన్ని మహమ్మదీయ స్త్రీ పురుషులకు ఆస్తి సంక్రమించే విషయంలో సమానమయిన హక్కులను కల్పించేందుకు తగిన చట్టాలను విధానసభలో ప్రవేశపెట్టవలసిందిగా నచ్చచెప్పవలసిన బాధ్యత మహమ్మదీయ సోదర సోదరీమణులపై వున్నది.

## క్రైస్తవుల స్థితి

భారతీయ వారసత్వ చట్టంలో క్రైస్తవులకు, పారశీలకు ఆస్థి సంక్రమించే విధం వివరించబడివుంది. ఒక క్రైస్తవ పురుషుని మరణానంతరం అతని ఆస్థిలో మూడవ వంతు విధవరాలయిన భార్యకు సంక్రమించగా - మిగతాది కుమారులు, కుమార్తెలు అందరూ సమాన వాటాలలో పంచుకునే హక్కును కలిగి వుంటారు. చూడగా యిది సమంజసంగానే వుంది. పారసీ పురుషుని మరణానంతరము అతని ఆస్థికి విధవరాలయిన భార్య, బిడ్డలు వారసులవుతారు. ఆస్థి పంపకంలో మాత్రం విధవరాలైన భార్య, పుత్రుల వాటాలు కుమార్తె వాటాకంటె రెట్టింపు వుంటాయి. కాని పారశీ స్త్రీ మరణానంతరం భర్త, బిడ్డలు ఆస్థిని సమానంగా పంచుకుంటారు. ఈ విధంగా వారసత్వ చట్టం పారశీల విషయంలో స్త్రీ, పురుషుల మధ్య వివక్షత చూపుతుంది కనుక వీరి విషయంలోకూడ చట్టంలో మార్పు రావలసిన అవసరం వుంది.

హిందూ, మహమ్మదీయ, పారసీ క్రైస్తవులలో వివాహాలు తిరిగి వివిధ చట్టాలమూలంగా కట్టుదిట్టం చేయబడ్డాయి. క్రైస్తవులలో వివాహం ఎప్పుడూ ఏక పత్నీ వ్రతమే. హిందువులు, పారసీల విషయంలో పూర్వం బహుభార్యాత్వము కొనసాగినా చట్టంద్వారా ఏకపత్నీవ్రతం అమలులోకి వచ్చింది. మహమ్మదీయ వివాహ వ్యవస్థలో యింకా బహుభార్యాత్వమే ప్రత్యేకించి అంతర్జాతీయ మహిళా సంవత్సరంలోకూడ కొనసాగటం నేలవిడిచిన సాము మాత్రమే. మహమ్మదీయునకు నల్గురు భార్యలుండవచ్చు. అవగాహన గల్గిన ఏ మహమ్మదీయుడుకూడ మహమ్మదీయ వివాహ వ్యవస్థలో ఏకపత్నీవ్రతాన్ని చట్టంద్వారా అమలులోకి తెస్తే కాదనడు. మహమ్మదీయ మహిళల హోదాను పెంచదలిస్తే వెంటనే మన పార్లమెంటు యీ సంస్కరణాయుతమయిన చట్టాన్ని రూపొందించవలసివుంది. కొన్ని ఇస్లామిక్ దేశాలలో బహుభార్యాత్వము ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నిషేధింపబడింది. అందువలన మన ప్రభుత్వం ఊగిసలాటతో నిమిత్తం లేకుండా ఇస్లామిక్ దేశాల విధానాన్ననుసరించి చట్టాలను రూపొందించవచ్చు.

## వధువులకు కనీస వయఃపరిమితి

ఈ విషయంలో హిందూ వివాహ చట్టము, ఇండియన్ - క్రిష్టియన్ వివాహ చట్టము వధూవరుల మధ్య తారతమ్యాన్ని సృష్టించాయి. వివాహం చేసుకోవాలంటే వరునకు 18 సంవత్సరాలు నిండాలి. వధువుకు 15 సంవత్సరాలు నిండితే చాలు. అప్పటికి వరుడు మేజర్ అవుతాడు. వధువు మేజర్‌కాని పక్షంలో వివాహానికి సంరక్షకుల అనుమతి వుండితీరాలి. మహమ్మదీయులు, పారసీల విషయంలో వధూవరు లిరువురకూ 15 సంవత్సరాలు నిండితే వివాహం చేసుకోవచ్చు. అయితే మహమ్మదీయ బాలబాలికల విషయంలో వారికి యుక్తవయస్సు రాని పక్షంలో సంరక్షకుల అనుమతి తీసుకోవలసి వుంది. అదే పారసీల విషయంలో అయితే వధూవరు లిరువురకూ 21 సంవత్సరాల వయస్సు వచ్చేవరకూ సంరక్షకుల అనుమతి తీసుకోవలసి వుంది. ఈ తారతమ్యాల నన్నింటినీ తొలగించి అందరకూ ఒకే విధంగా కనీస వయఃపరిమితి 18 సంవత్సరాలుగా నిర్ణయించే విషయాన్ని పార్లమెంటు ఆలోచన చేయవలసి వుంది. 18 సంవత్సరాలయితే అందరూ తమ వివాహ కాలం నాటికి తప్పక మేజర్లు అవుతారు కదా!

విడాకులచట్టం అందులోనూ ప్రత్యేకించి మహమ్మదీయుల విడాకులకు సంబంధించిన చట్టం ఎంతో సంస్కరింపవలసిన అవసరం వుంది. ముస్లిం లా ప్రకారం యుక్తవయస్సు వచ్చిన ఏ పురుషుడయినా తన భార్యకు ఏ కారణము చెప్పనవసరం లేకుండానే విడాకులు యివ్వవచ్చును. దానినే వారు "తలాక్" అంటారు. ఇంతకంటే ఘోరమయినది మరొకటి వుండబోదు. చాలా ఇస్లామిక్ దేశాలలో భర్త ఆ విధంగా "తలాక్" యిచ్చే పద్ధతిని న్యాయశాస్త్రంలో కొన్ని బిగింపులు చేశారు. భారతదేశంలో మహమ్మదీయులకు సంబంధించిన యీ విడాకుల సూత్రాలను సంస్కరింపవలసిన అవసరం ఎంతో వుంది. భర్త తాను కారణం చెప్పకుండా విడాకులిస్తున్నానని ఒక్కమాట చెప్పి విదిలించికుపోవచ్చుగాని భార్యకు మాత్రం భర్త అలా చేసేందుకు అనుమతినిస్తే తప్ప "తలాక్" యివ్వడానికి వీలులేదు.

ఎలాగయితేనేం 1939 ముస్లిం వివాహ చట్టంద్వారా భార్యకూడ యీ క్రింద పేర్కొన్న కొన్ని సందర్భాలలో విడాకులు యిచ్చేయడానికి కోర్టులో దావా వేసుకునేందుకు అవకాశం కల్పించబడింది.

1) నాల్గు సంవత్సరాలకాలం భర్త అదృశ్యుడయితే ; 2) రెండు సంవత్సరాల పాటు భార్యయొక్క పోషణను అశ్రద్ధ చేసినట్లయితే ; 3) ఏడు సంవత్సరాలపాటు భర్త కారాగారము పాలయినందే ; 4) వైవాహిక బాధ్యతలను నెరవేర్చడలో భర్త విఫలుడయితే ; 5) భర్త నపుంసకుడయితే ; 6) పిచ్చివాడయితే ;

7) క్రూరుడయితే — విడాకులకొరకు దావా వేయవచ్చును. భర్తకుగల "తలాక్" అధికారాన్ని రద్దు చేయవలసినదిగాను, దాని బదులుగా భర్తనుండి విడాకులు పొంద డానికి 1939 చట్టంలో భార్యకు ఏ అవకాశాలున్నవో, అలాంటి అవకాశాలనే భార్యకు విడాకులు యివ్వడానికిగాను భర్తకు కల్పించాలని కోరబడింది.

## హిందూ వివాహ చట్టం

1955 హిందూ వివాహ చట్టం మొట్టమొదటిసారిగా హిందూ స్త్రీకి విడాకులు కోరే అధికారాన్ని యిచ్చింది. భర్త జారుడయితే, మతాంతరుడుగా మారితే, బాగు చేయలేని విధంగా మతిచెడినవాడయితే, కుష్ఠురోగి అయితే, మూడేండ్లపాటు సుఖ రోగాలతో బాధపడుతూవుంటే, సన్యాసము స్వీకరించివుంటే, లేదా ఏడు సంవత్సరాల పాటు కానరాకుండాపోతే భార్య భర్తనుండి విడాకులు కోరవచ్చును. వదలివేయడం, లేదా క్రూరత్వం, లేదా పోషణలో అలసత్వమనేది విడాకులకు ఆధారంగా భావింప బడకపోవడం గమనార్హం. యివి విడాకులకు గాక ప్రత్యేక గృహంలో జీవించడానికి మాత్రం హిందూ ఎడాప్షన్ అండ్ మెయిన్‌టెనెన్స్ ఆక్టు ద్వారా అర్హతలుగా గుర్తించబడ్డాయి. అలాగే రెండేండ్లపాటు వదలివేయడం జరిగితే, లేదా కలిసి జీవిం చడం తనకు ప్రమాదకరమని భార్య భావించి విశ్వసించడానికి తగినంత క్రూరత్వం ప్రదర్శిస్తే— అప్పుడు జుడీషియల్ సెపరేషన్ (చట్టబద్ధమైన వేర్పాటు, పొంద వచ్చును. అట్టి "వేర్పాటు" పొందిన రెండు సంవత్సరాల పిదప మధ్యకాలంలో యిద్దరు కలియకపోతే, భార్య, విడాకులకై అర్జీ పెట్టుకోవచ్చును.

ఒక భార్య తాను నేరుగా వదలివేయడం, లేదా క్రూరత్వం, అలసత్వముల కారణంగా విడాకులు పొందడానికి అటంకం సహేతుకం కాదు. ముందు చట్టబద్ధమైన వేర్పాటు, ఆ పిదప రెండేండ్లు వేచి వుండడం, ఆ పిదప విడాకులూ – యీ క్రమం అవసరం లేదు. యీ రెండేండ్ల కాలంలో భర్త తాను మంచి ప్రవర్తన కలిగివున్నట్లు నటించి, మధ్యపెట్టి భార్యతో సమాగమించి, విడాకులు పొందే అవకాశాన్ని వమ్ము చేయవచ్చును. పోషణలో వైఫల్యం, వైవాహిక బాధ్యతలు నెరవేర్చకపోవడం, క్రౌర్యమనేవి 1939 ముస్లిం వివాహాల రద్దు చట్టం ప్రకారం విడాకులకు తగిన ప్రాతిపదికలు అని పైనే చెప్పివున్నాను. కనుక హిందూ వివాహ చట్టాన్నిగూడా దానితో సమానం చేయవచ్చును.

క్రైస్తవ లేదా పార్సీ స్త్రీల పరిస్థితిగూడా ఏమంత మేలుగాలేదు. ఒక పార్సీ వనిత క్రౌర్యము, లేదా పోషణలో అలసత్వములు ఆధారంగా విడాకులు పొంద జాలదు. కాగా క్రౌర్యప్రవర్తన ప్రాతిపదికమీద చట్టరీత్యా వేర్పాటును మాత్రం కోరవచ్చును. ఒక క్రైస్తవ వనిత క్రౌర్యం, వదలివేయడం, పోషణలో అలసత్వం

తుదకు వ్యభిచారం - ప్రాదిపదికమీదగూడా విడాకులు పొందజాలదు. ఇండియన్ విడాకుల చట్టం క్రింద ఆమె incestuous వ్యభిచారం చేసినా, బహుభార్యాత్వానికి పాల్పడినా, లేదా వ్యభిచారంతోపాటు క్రౌర్యానికిగానీ, వ్యభిచారంతోపాటు వదలి వేయడానికిగానీ పాల్పడినా విడాకులీయవచ్చును. అంతేగాని కేవలం వ్యభిచారం, లేదా క్రౌర్యం లేదా వదలివేయడం అనే నేరాలకు విడాకులు అడిగే వీలులేదు. కనుక యీ యిండియన్ విడాకుల చట్టంలోని అంశాలు పూర్తిగా కాలదోషం పట్టినదనడంలో సందేహంలేదు. వానిలో సంస్కరణ జరిగి తీరాలి.

## మైనరు పిల్లల రక్షణ

మైనరుపిల్లల రక్షణ, గార్డియన్ షిప్‌ల విషయంలోగూడా చట్టం తల్లికి వ్యతిరేకంగా తండ్రివల్ల పక్షపాతాన్ని ప్రదర్శిస్తోంది. బిడ్డలకు 5 సం॥ వచ్చేవరకూ హైందవమాత రక్షణక్రింద ఉంచడానికి ప్రాధాన్యత యివ్వబడింది. ముస్లిము తల్లి తన కుమారునికి 7 సం॥ దాటేవరకూ, కుమార్తె యీడేరేవరకూ సంరక్షణ హక్కులు కలిగివుంటోంది. యిది మినహాగా పిల్లల పోషణ, సంరక్షణ హక్కు హిందూ, ముస్లింమతాలు రెంటిలోనూ తండ్రులదే. ఈ నాడున్న చట్టప్రకారం కుమార్తెయొక్క అవసరం తల్లికి ఎప్పుడు ముఖ్యంగా అవసరమో, సరిగ్గా ఆ సమయానికి కుమార్తె తల్లినుండి వేరు చేయబడుతుంది.

"పర్సనల్ లా"కు సంబంధించిన వాటిలో యివి కేవలం కొన్ని అంశాలు. కొద్దిపాటి చట్ట సంస్కరణద్వారా వీటిని సరిచేయవచ్చును. యివి చాలా మౌలికమైన మార్పులు. అవి జరుగకుండా భారత స్త్రీలకు చట్టరీత్యా యివ్వబడే స్థాయి, హోదాలలో, హక్కులలో మార్పు సాధ్యంకాదు. కనుక యీ దిశగా తగిన చట్టబద్ధమైన సంస్కరణలకు వెంటనే పూనుకోవాలి. ఆ విధంగా రెండు లక్ష్యాల దిశగా సంస్కరణ ప్రారంభమవుతుంది. ఒకే సివిల్ చట్టం నిర్మాణం కావడం, స్త్రీల సంక్షేమం సాధించబడడం.

# ఉత్తర వియత్నాంలో మాతా శిశు సంక్షేమం

## ఉత్తర వియత్నాం జనాభా $2\frac{1}{2}$ కోట్లు

—మోటూరు ఉదయం

వియత్నాం స్త్రీలు ఫ్యూడల్ సమాజంలో ఎందుకూ పనికిరాని వాళ్ళుగా తిరస్కరించబడ్డారు. ఆ తర్వాత వలస పాలనలో కూడా స్త్రీలు పరమ దుర్భర జీవితాన్ని అనుభవించారు. ప్రసూతి, శిశు సంక్షేమంకోసం దేశమంతటికి 300 ఆస్పత్రి పడకలు ఉండేవి. వాటిలోకూడా అధికభాగం కలవారికోసం కేటాయించబడేవి. వైద్యశాలలు గాని, ప్రసూతి గృహాలుగాని, గ్రామసీమలలో అసలుండేవికావు. వైద్యశాస్త్రం బొత్తిగా తెలియని మంత్రసానుల, బంధువుల సాయంతో స్త్రీలు తమ ఇళ్ళలోనే పురుడు పోసుకునేవాళ్ళు. మూఢాచారాలవల్ల ప్రసవానికి సంబంధించి అనేక కష్టాలు సంభవించేవి. ఇందువలన వచ్చే జబ్బులవల్ల ప్రతి ఏడూ అనేక మంది పసిబిడ్డలు, పిల్లలూ చనిపోతూండేవాళ్ళు. ధనుర్వాతం, మశూచి, మలేరియా వంశ పారంపర్య మహావ్యాధి మొదలగు జబ్బుల పాలబడుతూండేవాళ్ళు. గర్భిణీ స్త్రీలు, పసి బిడ్డలు అధిక సంఖ్యలో చనిపోతూండేవాళ్ళు.

— వెయ్యింటికి 20 మంది గర్భిణీ స్త్రీలు.

— వెయ్యికి 300 నుంచి 500 వరకు అప్పుడే పుట్టిన పసికందులు.

— వెయ్యికి 400 వంతున ఒక సంవత్సరంలో చంటి బిడ్డలు చనిపోతూండేవాళ్ళు.

స్త్రీలకు, తల్లీ-బిడ్డలకు ఎలాంటి ఆరోగ్య రక్షణ ఉండేదికాదు. వారికోసం ఎలాంటి సాంఘిక శాసనం ఉండేదికాదు. పురుషులకంటే మిక్కిలిగా స్త్రీల శ్రమ దోచుకోబడేది.

## విముక్తి అనంతరం

విముక్తి అనంతరం వియత్నాం ప్రజలు ఏకదమ్మున మాతా శిశు సంక్షేమం కోసం పటిష్టమైన పద్ధతిని ప్రవేశ పెట్టారు. రాజకీయ, సాంఘిక రంగాలలో స్త్రీలు పాల్గొనేందుకు ప్రభుత్వం మంచి ప్రోత్సాహమిచ్చింది. అందుకు తగిన చర్యలన్నింటిని తీసుకుంది.

1946 లో రూపొందించబడిన ఉత్తర వియత్నాం మొదటి రాజ్యాంగంలో ఇలా నిర్దేశింపబడింది :

"మాతా శిశు హక్కులను, ప్రయోజనాలను ప్రభుత్వం కాపాడుతుంది. ప్రసూతి గృహాలను, నర్సరీలను, కిండర్ గార్డెన్‌లను అభివృద్ధి పర్చేందుకుగాను సంపూర్ణ సమానత్వం సాధించడానికి, బహుభార్యా విధానాన్ని రద్దుచేసేందుకు ఈ శాసనం ఉద్దేశించబడింది. ఆ సంవత్సరమే పిల్లలు, యువజనుల రక్షణ కమిటీ నియమించబడింది. 1963 లో మాతా శిశు సంరక్షణకోసం ప్రధానమంత్రి ఫ్రాంవాన్‌డాంగ్ అధ్యక్షతన ఒక కమిటీ ఏర్పడింది. రాష్ట్ర, జిల్లా, గ్రామ స్థాయిల్లో ఆయా స్థానిక పరిపాలనా కమిటీల అధ్యక్షుల నాయకత్వాన యీ కమిటీ వ్యాప్తి చెందింది. ఇంకా ఆయా స్థానిక పరిపాలనా కమిటీ సభ్యులు, అధికారులుగావున్న స్త్రీలు, ట్రేడ్‌యూనియన్లు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, ఆరోగ్య సర్వీసుల ప్రతినిధులు యీ కమిటీలో సభ్యులుగా ఉంటారు. స్త్రీల, పిల్లల ప్రయోజనాలకోసం పట్టుదలతో కృషిచేసేందుకు ఈ చర్యలు తోడ్పడ్డాయి."

## గ్రామాలలో సైతం ప్రసూతి గృహాలు

ఇప్పుడు 97.5 శాతం గ్రామాలలో ప్రసూతి గృహాలు, ఆసుపత్రులువున్నాయి. అన్ని రాష్ట్ర, జిల్లాల ముఖ్య పట్టణాలలో ఆసుపత్రులు నిర్వహించబడుతున్నాయి. ఈ ఆసుపత్రులన్నిటిలో మొత్తం పడకలలో 24500 ప్రసూతి స్త్రీలకోసం, పసి పిల్లల కోసం రిజర్వు చేయబడ్డాయి.

స్త్రీల ఆరోగ్యం కోసం రాజధానీ నగరం మొదలు గ్రామాల వరకు 751 మంది లేడీ డాక్టర్లు, 368 మంది డాక్టర్లు, 13684 మంది మంత్రసానులు ఉన్నారు. వైద్య, ఆరోగ్య సిబ్బంది గర్భిణీ స్త్రీలను ముందు ఆసుపత్రులలో పరీక్ష చేస్తారు. ఆతర్వాత కాన్పులు చేస్తారు. స్త్రీల గర్భాశయాలకు చెందిన జబ్బులకు అంబులేటరీ చికిత్స నిస్తారు.

కష్టసాధ్యమైన ప్రసూతి కేసులను చూసేందుకు, శస్త్రచికిత్స చేసేందుకు జిల్లా ఆసుపత్రులలో 87 శాతం తగిన వసతులు కల్పించబడివున్నాయి.

## 50 వేల నర్సరీలు

ఫ్యాక్టరీలలోను, గృహ నిర్మాణంలోను, సహకార వ్యవసాయ క్షేత్రాలలోను, అడవిలో కర్ర నరుకుడు, తదితర పనులుచేసే కేంద్రాలలో ప్రస్తుతం 50వేల నర్సరీలు ఉన్నవి. కొలది సంవత్సరాలలోనే రైతులు తమ కుటుంబాల ఉపయోగానికి 9 లక్షల

డావులు తవ్వించుకున్నారు. అలాగే 7 లక్షల 50 వేల మరుగుదొడ్లు కట్టించుకున్నారు ఈ విధంగా స్త్రీలకు ఆరోగ్య అవసరాలు బాగా అభివృద్ధి అవుతున్నాయి.

స్త్రీలు ఎక్కువగా వున్న కేంద్రాలలో వారి వైద్య పరీక్ష కోసం అంబులేటరీ చికిత్సకోసం చాలా డిస్పెన్సరీలు యేర్పాటు చేయబడ్డవి.

1962లో కుటుంబ నియంత్రణ కాంపెయిన్ ప్రారంభించబడింది. ఈ కాంపెయిన్‌ను ప్రజలు సానుభూతితో స్వీకరించారు. ఈ ఉద్యమం గ్రామీణ ప్రాంతాలకు కూడా వ్యాపించింది. తత్ఫలితంగా జననాల సంఖ్య 1968లో 46.1 శాతం తగ్గింది.

ప్రభుత్వం, ప్రజాసంఘాలు 40వేల సహాయక గ్రూపులను యేర్పాటు చేశాయి. ఈ గ్రూపులలోకి ఆరు లక్షలమంది స్త్రీలు సమీకృతు లయ్యారు. వీరిలో గర్భిణీ స్త్రీలకు, ప్రసవ సందర్భంగాను సహాయపడతారు. మాతా శిశు సంక్షేమం గురించి ప్రజలలో బహుళ ప్రచారంచేసే కృషిలో 87 వేల మంది వలంటీర్లు నిమగ్నమై ఉన్నారు.

## మరణాల సంఖ్య తగ్గుదల

మాతా శిశు సంక్షేమ కార్యక్రమం అమెరికా బాంబింగువల్ల తీవ్రంగా దెబ్బ తినవల్సి వచ్చింది. రాకెట్లు, నపాం బాంబులు, ఫాస్ఫరం బాంబులు తదితర విష వాయువుతోకూడిన ఆయుధాలను పట్టణాలపైన, గ్రామాలపైన పేల్చారు. ఈ బాంబు దాడులకు ప్రత్యేకించి పిల్లలు చాలా తీవ్రంగా గురిఅయ్యారు. కాని, ఈ దాడులనుండి రక్షించేందుకు తగిన చర్యలు తీసుకోబడినవి. ఈ కార్యక్రమంలో నర్సరీలు, కిండర్ గార్డన్‌లు ఇతోధికంగా కృషి చేశాయి. భూమి లోపల సొరంగాలు తీసి, ఈ సొరంగాలు ఒక్కొక్కప్పుడు 15, 17 కిలో మీటర్ల లోతు తీసి రక్షణ కల్పించబడినది. అనేకమంది పిల్లల ప్రాణాలు కాపాడటంలో నర్సులు, ఉపాధ్యాయినిలు సాహసోపేతమైన కృషి చేశారు. బాంబు దాడులు జరిగినప్పుడు డాక్టర్లు, మంత్రసానులు తమ కర్తవ్య నిర్వహణలో విఫలులు కాలేదు. చాలా త్యాగనిరతితో పని చేశారు. ఆ విధంగా మరణాల సంఖ్య ఒక మోతాదులో వారు తగ్గించగలిగారు. మాతా శిశు సంక్షేమ కార్యక్రమం యుద్ధ సమయంలో కొంత వెనకడుగు పట్టినా యీ ఉద్యమం మాత్రం అభివృద్ధిని సాధిస్తూ ముందుకు పోతున్నది.

గ్రామాలలో ప్రసూతి గృహాలు, ఆసుపత్రులు, నర్సరీలు, కిండర్ గార్డన్లు, ప్రాథమిక పాఠశాలలు, కుటుంబాలకు మరుగుదొడ్లు నిర్మించబడుతున్నవి.

ప్రసూతి మరణాలు 1945 లో వెయ్యికి 20 వుంటే 1968 లో 0.8 మాత్రమే ఉంది.

పుట్టగానే చనిపోయిన బిడ్డల సంఖ్య 1945 లో వెయ్యింటికి 300-400 వుంటే 1968 లో 12 - 25 మాత్రమే ఉన్నది.

ఒక నెల లోపల బిడ్డల మరణసంఖ్య 1968లో వెయ్యింటికి 18.32 మాత్రమే.

ఒక సంవత్సరం వయస్సుగల బిడ్డల మరణ సంఖ్యలో 1945లో వెయ్యింటికి 400 వుండగా 1968లో 32.72 మాత్రమే.

ముఖ్య రోగాలను మొత్తంగా మట్టుబెట్టటం జరిగింది. మసూచి, కలరా, పోలియో, మలేరియా వ్యాధులు పూర్వం భయంకరంగా ఉండేవి. ఇప్పుడు యీ వ్యాధులన్నింటినీ తుదముట్టించడం జరిగింది.

మన దేశంయొక్క ఆర్థిక పరిస్థితి ఎట్లావున్నా, 30 ఏళ్ళపాటు యుద్ధంలో మునిగి ఉన్నందువలన పారిశ్రామిక రంగంలో మన కృషిని కొంత పరిమితం చేసుకోవాల్సి వస్తున్నది.

మాతా శిశు రక్షణ కమిటీ ప్లీనం సమావేశంలో ప్రధానమంత్రి ఫాంవాన్ - డాంగ్ ఇలా చెప్పారు.

'పూర్వంవున్న దానితో పోల్చిచూస్తే మనం సాధించింది చాలా ముఖ్యమైనది. కాని ఇది మన అవసరాలకు చాలా తక్కువ కాబట్టి మాతా శిశు సంరక్షణకోసం మనం యింకా గట్టి విశ్వాసంతో, సౌహార్ద్రతతో, నిర్మాణయుతంగా కృషిచేసి మంచి ఫలితాలను సాధించవలసి ఉంది.'

విద్య, వికాసము, విజ్ఞానము - ఈ మూడు కలిగియున్న ప్రజలను సామ్రాజ్యవాదులు పాలించడం కష్టము. అందుకని విజ్ఞానాత్మక విద్య వారి అందుబాటులో లేకుండా జేయుటే ఫ్రెంచి సామ్రాజ్యవాదుల రాజనీతి. ఫ్రెంచి పాలనకు లోబడి యున్న జానిస దేశాలలో పాఠశాలలు బహుస్వల్పం. అసలు లేవనే చెప్పవచ్చును. నిరక్షరాస్యులను మోసం చేయుట, పీడించుట, సులభమని, వారిలో మేధాశక్తిని, తన్మూలమైన అభివృద్ధిని అరికట్టడం ఫ్రెంచి సామ్రాజ్యవాదుల అభిప్రాయం. వియత్నాం ప్రజానీకంలో నూటికి 95గురు అక్షరజ్ఞానము లేనివారే. నూటికి ఏ ముగ్గురో ప్రాధమిక విద్య నభ్యసించిన వారుండేవారు. ఇక ఉన్నత విద్య విషయము చెప్పనే అవసరము లేదు. ముప్పైవేల మందిలో ఒక్కరుండటం కూడా అరుదు. ఉన్నత

విద్యకూడ కేవలం బానిస రాజ్యపరిపాలనా యంత్రాంగమునకు కావలసినంతమటుకే యుండెను. వియత్నాం ప్రజలు బానిస జీవితమునకు అలవాటుపడిన కొంతమంది, నూతన సాంప్రదాయములను విడువనివారు యీ రకపు విద్యయందు ఉదాసీనతతో నుండిరి. వలస విధానము, ఫ్యూడలిజము మధ్యన ప్రజలు ముఖ్యముగా స్త్రీలు చాల అణగద్రొక్కబడిరి. బానిసలకు బానిసలుగా వీరిని అణచివేసిరి. విద్యలో, పనిలో, దేనిలోనూ, వీరికి పురుషులతో సమానత్వం లేదు. సాంఘిక, రాజకీయ వ్యవహారము లలో వారు పాలు పంచుకొనలేరు. స్వశక్తిమీద నిలువలేరు. పరాధీనతతో జీవిత మంతయు గడపవలెను, కుటుంబంలో తండ్రి, భర్త, అన్నలు మొదలగు వారిపై ఆధార పడియుండవలెను. బయట ప్రపంచంతో ప్రమేయము లేదు. అందువలన స్త్రీలు అక్షర జ్ఞానము లేక అస్వతంత్రులు. ఏ కొద్దిమందో స్కూలుకి వెళ్ళినచో వారు శ్రీమంతుల యింటివారు అయివుంటారు.

## అనాథ స్త్రీల నికృష్ట జీవితం

అజ్ఞానము, అభద్రత స్త్రీలను యింకా దుర్భర స్థితికి దించినవి. పొలంలో పనులు చేయునప్పుడు కూడా వారికి సులువు మార్గములు కొత్త పద్ధతులు తెలుపరైరి. ఇంకనూ పాతకాలపు ఉత్పత్తి విధానము అవలంబించు చుండిరి. అనాధ స్త్రీలు, పట్టణములలో పనిచేయుచున్న స్త్రీలగతి యింకనూ నికృష్టముగ నున్నది. వారి జీత ములు అతి స్వల్పము. విద్యా, విజ్ఞానములు, ఆరోగ్య సదుపాయాలులేని దుస్థితికి వారూ వారి పిల్లలు నెట్టబడిరి. వీరి అజ్ఞానము వెనుకబడినతనము పురస్కరించుకొని యజమానులు నిర్దయగ పీడించేవారు.

ఫ్రెంచి రాజకీయ సిద్ధాంతాల ఆంతర్యమును క్రమక్రమముగ వియత్నాం ప్రజానీకం అనుభవ పూర్వకముగ తెలిసికొన్నది. దేశ భక్తులు మెల్ల మెల్లగ ఎలు గెత్త నారంభించిరి. ఆ కాలంలో ఫ్రాన్సులో ప్రవాసంలోవున్న ప్రెసిడెంటు 'హూచ్ మిన్' ఎన్నో పర్యాయములు యీ ఘోర పాప కృత్యములను ఖండించెను. ప్రముఖ ప్రజా పక్షములు రెండూ వైజ్ఞానిక సాంస్కృతిక ఉద్యమాలను నడిపాయి.

## దేశ పురోగతికి స్త్రీ విద్య అత్యంత అవసరం

అక్షర జ్ఞానము లేనివారి సంఖ్యలో ఆడవారే ఎక్కువ. పర ప్రభుత్వం ధర్మమా అని స్త్రీ విద్య పూజ్యము. డెమోక్రాటిక్ రిపబ్లిక్ ప్రభుత్వము స్త్రీలకు సమాన హక్కులను కలిగించినది. దాని ఫలితముగా స్త్రీలకు విద్యారంగంలో సమాన అవకాశములు చిక్కినవి. దీర్ఘ కాలము స్త్రీ దాస్యశృంఖలాలలో బంధించబడినదై వెనుకబడియున్నది. ఇప్పుడు స్త్రీ విద్య దేశ పురోగతికి అత్యంత అవసరము.

'పురుషులతో ఆమె సరిసమానముగ తన హక్కులను వినియోగించుకొనవలెను. దేశ పురోగతికి వారు బాధ్యులే. జాతీయ సౌభాగ్యానికి వారు భాగస్వాములే. వారికి ఓటు హక్కు వున్నది' అని ప్రెసిడెంటు హూచిమిన్ ఉద్బోధించిరి. 1941లో మహిళా జాతీయ సంక్షేమ సంస్థ, 1946లో వియత్నాం మహిళా సమాఖ్య స్త్రీ విద్యావశ్యకతను గ్రహించి సత్వర చర్యలు తీసికొనసాగిరి. స్త్రీ స్వాతంత్ర్యము స్త్రీ విద్యతో ముడిపడి యున్నది. దేశ ఆర్థిక స్తోమతను పెంచుటకు స్త్రీలు ఉత్పత్తికి తోడ్పడవలెను. అందుకు శ్రామికులుగా ఉత్పత్తి బాధ్యత పురుషులతోపాటు స్త్రీలు నిర్వహించవలెను. సాంకేతిక శాస్త్రనిపుణత సంపాదించవలెను. రాజకీయ పరిజ్ఞానము, దేశాభిమానము గల పౌరులుగా తయారుకావలెను. అన్నిటికన్న ముఖ్యము, తమ పిల్లలను చక్కగా పెంచగలిగిన తల్లులు కావలెను. ఈ విధముగా సర్వతో ముఖముగా స్త్రీలలో అభివృద్ధి కలుగ జేయుటకు మహిళా సంస్థలు పూనుకొన్నవి. ప్రభుత్వ సహాయ సహకారములతో పలురకములు వయోవిద్యా కేంద్రములు నెలకొల్పిరి. సంసారములోని యిబ్బందులను ఒక కంట కనిపెట్టుతూ సహాయపడుచుండిరి. స్త్రీలకు విద్య నేర్పు అవకాశములు పెక్కు కలుగజేసిరి. ఇందులకు విద్యాశాఖ ఉద్యోగస్తులైతేనేమి, యూనియను సభ్యులయితేనేమి, వారికి వున్న పారశాలానుభవమును వినియోగించి విద్యాబోధనకు పూనుకొనిరి. 'మాధీదాన్' పర్వతప్రాంతములలో యీ విధముగ స్వచ్ఛంద విద్యా సేవచేసి అచ్చటి గిరిజనులలోనే ఉపాధ్యాయులను తర్ఫీదుచేసిరి.

ఈవిధముగ వయోజన విద్య సర్వతోముఖముగా సాగుచుండెను. పల్లెలలో, పట్టణములలో, సముద్ర తీరములలో, పొలాలలో, పరిశ్రమ ప్రాంతాలలో, వీధులలో సర్వేసర్వతా ప్రజలు ప్రజానీకము తమ పనులు నిర్వహించుతూ, అటు విశ్రాంతి సమయములలో పలకలు, పుస్తకాలు పట్టుకొని చదువు నేర్చుకొనుచుండిరి. ఇంటలో పిల్లలతోనున్న ఆడువారియొద్దకు టీచర్లు వెళ్ళికూడ అక్షరజ్ఞానము కలుగజేసిరి. విప్లవం తరువాత ఒక్క సంవత్సరములోగా మొత్తము దేశములో 30 లక్షలమంది విద్యార్థులు, లక్షకుపైగా అధ్యాపకులు, వేలాది ప్రచారకులు, నిర్వాహకులు బయలుదేరిరి. 25 లక్షలమంది ప్రజలు, స్త్రీలు, పురుషులు అక్షరాస్యులయిరి. మరి ఏడు సంవత్సరములలో వీరి సంఖ్య ఐదురెట్లు పెరిగింది. వీరిలో సగము స్త్రీలే యుండిరి.

## పల్లెసీమలలో పతాకస్థాయి నందుకొన్న ఉద్యమం

వియత్నాం మహిళా సమాఖ్య దేశ పలుప్రాంతాలలోనూ అన్ని స్థాయిలలోను విద్యావ్యాప్తికి కృషిచేసినది. పాప్యులర్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటుతో చాల సన్నిహితముగ పనిచేసినది. పల్లె ప్రాంతములలో ఈ ఉద్యమము పతాకస్థాయి నందుకున్నది. ఫ్యాక్టరీలలో, వర్కుషాపులలో, గృహములలో చదువుకొనవలసిన వారి జాబితాలు తయారుచేసి వారికి విద్య గరుపుటకు ఆహ్వానములు పంపుచుండిరి.

టీచర్లు, విద్యార్థులు అంతో యింతో చదువుకున్నవారు, స్త్రీలు అందరూ ఇందులో పాల్గొనిరి. వయస్సుమళ్ళిన స్త్రీలుకూడ గుంపులు గుంపులుగా ఇంటింటికి విద్యావశ్యకతను ప్రబోధించుచుండిరి. వారికి కావలసిన పుస్తకములు, పెన్సిళ్లు పంచిపెట్టిరి. రాత్రిళ్లు చదువుకొనుటకు దీపములకు చమురుకూడ పంచిపెట్టినారు. ఇందులకై ధనము విలువజేసి పేదవారికి సహాయపడెడివారు. వారు ఒక్కదినముకూడ క్లాసులు మానకుండా ఉండేందుకు యిండ్లలో సదుపాయములు చూచేవారు. మొత్తము 1958 సంవత్సరమునకు ఉత్తర వియత్నాంలో 15 నుండి 45 వయస్సులోని స్త్రీలందరూ విద్యాగంధ మబ్బినవారయిరి.

## శాస్త్రవేత్తలుగా అభివృద్ధి చెందిన స్త్రీలు

వ్యవసాయ పారిశ్రామిక రంగములో పనిచేయు వారికి వారి వారి పనులలో శాస్త్రబద్ధముగ నేర్పు సంపాదించి వృద్ధి చెందుటకు ఆయా ప్రదేశములలోనే యీ మాములు అనుబంధ విద్యా కేంద్రములు, శిక్షణా కేంద్రములు నడుపుచుండిరి. ఈ విధముగ పల్లెలోని పాకలనుండి పట్టణాలలోని భవనముల వరకూ, పొలముల నుండి ఫ్యాక్టరీల వరకు అన్ని రంగములలోనూ, అన్ని స్థాయిలలోనూ అచంచల జ్ఞాన ప్రబోధన సాగుచుండెను. ప్రాథమిక విద్యా దశనుండి విశ్వవిద్యాలయ దశ వరకు అనర్గళముగ అనుబంధ విద్య జరుగుచున్నది. చాలమంది స్త్రీలు తాము చేయుచున్న పనిలోనే డిగ్రీలు, డిప్లొమాలు అందుకొనిరి. సామాన్య కార్మికులు శాస్త్రవేత్తలుగ రూపొందిరి. శ్రామిక ప్రజలు శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, నర్సులు, డాక్టర్లు అయినారు. అటు జీవనోపాధి, యిటు విద్యావికాసము రెండూ 'సవ్యసాచి' వలె కొనసాగించిరి.

ఇంతియేగాక గృహిణులుగానున్న స్త్రీలు కొంతమంది పాఠశాలలకు సహాయక సంఘములుగా ఏర్పడి దేశమంతటా బడికిపోవు వయస్సులోని పిల్లలందరూ తప్పకుండా బడికిపోవునట్లు చూచెడివారు. కోఆపరేటివ్ ఫారములలో సభ్యులందరు కనీసము ప్రైమరీ వరకైన చదువవలెను. పై శ్రేణికి చెందిన వారు ఉన్నత పాఠశాల విద్యనభ్యసించవలెనని ప్రతిపాదించిరి.

ఫ్యాక్టరీలలో, ఆఫీసులలో పనిచేసే స్త్రీల సంఖ్య 4 శాతం నుండి 38 శాతం వరకు పెరిగింది. కార్మికులలో 70 శాతం స్త్రీలు. శాస్త్రీయ పరిజ్ఞానం కలిగి అందులో ఉన్నత శిక్షణ పొందిన స్త్రీలు మొత్తం శాస్త్రవేత్తలలో 31.8 శాతం పెరిగింది.

# తూర్పు జర్మనీలో తల్లులకు, వృద్ధులకు సౌకర్యాలు

—మోటూరు ఉదయం

నిత్యజీవితావసర వస్తువుల ధరలు రోజురోజుకు పెరిగిపోతుంటే వాటిని అదుపులో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నామని, ధరలు తగ్గుదల చూపుతున్నాయనీ, రేడియోలో, పేపర్లో ప్రకటనలేగాని ధరలు తగ్గటంలేదు. యీ ధరలు సామాన్య ప్రజల ప్రమాణాలు దెబ్బకొట్టేందుకు తయారవుతున్నాయి. ధరలు పెరుగుదల ప్రపంచ వ్యాపితంగా జరుగుతున్నదేనని పాలకులు ప్రచారం చేస్తున్నారు. నిజవేతనాలు నిజ ఆదాయాలు రోజురోజుకు పడిపోతూవుంటే, కనీసం వాటిని పూర్తిగా కాకపోయినా కొంత వరకైనా నిలబెట్టుకోవాలని ముందుకొస్తున్న కష్టజీవులకు ఎట్టి అవకాశాలు లేకుండా ఉన్నది మనదేశంలో.

నిజానికి ప్రపంచ వ్యాపితంగా ధరలు పెరిగిపోతున్నాయనేది వాస్తవంగాదు. పెట్టుబడిదారి ఆర్థిక వ్యవస్థలో మాత్రమే ధరలు పెరుగుదల; నిజ ఆదాయాల తగ్గుదల, జీవన ప్రమాణాలు పడిపోవడం జరుగుతోంది.

అందుకు భిన్నంగా సోషలిస్టు వ్యవస్థగల దేశాలలో ప్రజల జీవన ప్రమాణాలు, ఏడాది కేడాదికి పెంపొందుతున్నాయి. వారికి ధరల పెరుగుదల సమస్యలేదు. నిరుద్యోగ భయంలేదు. వృద్ధాప్యంలో తన భద్రతను గూర్చి ఆందోళనలేదు. అనారోగ్యానికి తావులేదు. వైద్య సౌకర్యాలకు కొదువలేదు. వ్యక్తిత్వం, మేధస్సు, సంపూర్ణంగా వికసించేందుకు అవసరమైన విద్యావకాశాలు అందరికి లభిస్తున్నాయి.

యీ సందర్భంగా యిరోపా ఖండంలోని చిన్న సోషలిస్టు దేశమగు జర్మన్-తూర్పు - ప్రజాతంత్ర రిపబ్లిక్‌లో ప్రజల జీవన ప్రమాణాలలో సాధించబడిన ఆశ్చర్యకరమైన అభివృద్ధిని పరిశీలిస్తే చాలు, సోషలిస్టు వ్యవస్థయొక్క గొప్పతనాన్ని గూర్చి అర్థం చేసుకోవచ్చు.

## జ న భ త్య ం

జర్మన్ ప్రజాతంత్ర రిపబ్లిక్ 1949లో ఏర్పడింది. మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన రెండు సంవత్సరాలకు రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ఆ ప్రాంతంలోని పరిశ్రమలలోని సగభాగం - విద్యుదుత్పాదక కేంద్రాలలో 100కి 66 వంతులు ధ్వంసమైనాయి. ఆ భయానక యుద్ధ శిధిలాలపైనే పునర్నిర్మాణం జరిగింది. యీ

నాడు అచ్చట ప్రజల జీవన ప్రమాణాలలో సాధించబడిన అభివృద్ధిలో కొన్ని అంశాలను పరిశీలించుదాం.

ఇద్దరు లేక ముగ్గురు అంటూ కుటుంబ నియంత్రణకోసం పెద్ద మొత్తాలు ఖర్చు చేయటం – గర్భనిచ్ఛిత్తికి సదుపాయాలు కల్పించబడటం మనం మనదేశంలో నిత్యం గమనిస్తూనే వున్నాం.

ఆ దేశంలో పుట్టే ప్రతి బిడ్డకూ వెయ్యి మార్కులు – (జర్మన్ నాణాలు) జనభత్యంగా చెల్లించడాన్ని జర్మన్ ప్రజాతంత్ర రిపబ్లిక్ 1972 జూలై నుండి ప్రారంభించింది. అంతకు పూర్వం ఒక్కొక్క బిడ్డకు 500 మార్కులు చొప్పున జనసత్యత్వం క్రింద తల్లికి ముట్టచెప్పబడుతుండేది. యీ విధమైన సహాయం ముఖ్యంగా యువ దంపతులకు ఎంతయినా సహకారిగా వుంటుంది. ఇంతేగాదు, పుట్టినప్పటినుండే బిడ్డల పెంపకం పట్ల సోషలిస్టు రాజ్యంలో ప్రదర్శించబడే శ్రద్ధకి అది మచ్చుతునక.

## తల్లులకు సౌకర్యాలు

గర్భవతిగా వున్నపుడు ప్రసవించిన తొలిరోజులలో తల్లులకు పూర్తి జీతంతో ఇవ్వబడే శెలవు మూడున్నర మాసాల నుండి నాలుగు మాసాలకు పెంచబడింది. జర్మన్ ప్రజాతంత్ర ప్రభుత్వం "కవలలు" జన్మించి ప్రసవించడంలో ఇబ్బందులకు గురియైన సందర్భాలలో ఆ శెలవు ఐదు మాసాలకు పొడిగించబడింది. యీ విధంగా ప్రసూతి శెలవు పెంచడవల్ల ప్రసవానంతరం తల్లి పూర్తిగా కోలుకొనేందుకు అనువుగా విశ్రాంతి తీసుకొనేందుకు, పుట్టిన బిడ్డపట్ల తొలిరోజులలో అత్యధిక శ్రద్ధ ప్రదర్శించేందుకు ఆస్కారం ఏర్పడుతోంది.

ఒంటరిగా జీవిస్తున్న కార్మిక స్త్రీల బిడ్డలకు క్రెచీలలో స్థానం ఏర్పాటు చేయటం, సాధ్యపడని సందర్భంలో బిడ్డకోసమని తాత్కాలికంగా తల్లి పనికి అంతరాయం కలిగిన సందర్భాలలో ఒక బిడ్డ తల్లికయితే ఆమె సగటు ఆదాయంలో 50 శాతం, ముగ్గురు బిడ్డలయితే 80 శాతం, 5 గురు బిడ్డలయితే 90 శాతం అంతరాయం కలిగిన కాలమంతా వేతనంగా చెల్లించబడుతుంది.

16 సంవత్సరాలలోపు బిడ్డలు ముగ్గురుగాని, అంతకంటే ఎక్కువగాని వున్న 22,000 మంది కార్మిక మహిళలకు వేతనాలలో ఎలాంటి తగ్గింపు లేకుండానే వారానికి 40 గంటలుకి పని తగ్గింపు '1972' జూలై ప్రారంభం నుండి అమలులోనికి వచ్చింది.

ఒకటి కంటే ఎక్కువ షిఫ్టులుండే పరిశ్రమలలో పనిచేసే కార్మికులలో 16 సంవత్సరాల వయసు గల పిల్లలు ఇద్దరేసి వున్న 3,15,000 కార్మిక మహిళలకు కూడా అదే విధంగా వారానికి 40 గంటల పని అమలు జరుపబడుతోంది.

## వివాహాలకు రుణాల మంజూరు

ఎక్కువమంది బిడ్డలుగల తల్లులకు వార్షిక శలవులు అధికం చేయబడ్డాయి. వివాహ సమయానికి 26 సంవత్సరాలు వయస్సు మించని ఫ్యాక్టరీ కార్మికులు, ఆఫీసులో పనిచేసే వుద్యోగులకు, సహకార రైతులకు, విద్యార్థులకు, వారి ఇద్దరి ఆదాయమూ కల్సి నెలకు 14 వందల మార్కులకు మించని వారికి ప్రభుత్వం వివాహ సమయంలో 5,000 మార్కుల మొత్తాన్ని రుణంగా ఇస్తుంది. ఆ మొత్తంపై ఎలాంటి వడ్డీ చెల్లించవల్సిన పనిలేదు. వారికి మొదటి బిడ్డ జన్మించ గానే వెయ్యి మార్కులు అప్పు మాఫీ అవుతుంది. రెండో బిడ్డ జన్మించగానే మరో 1500 మార్కులు అప్పు మాఫీ అవుతుంది. మూడవ బిడ్డ జన్మించగానే 2500 మార్కులు రుణం మాఫీ చేయబడుతుంది.

పని చేస్తుండగా సంభవించిన ప్రమాదాలకుగానీ, తాము పనిచేసే కర్మాగారాలు లేదా ఇతర సంస్థల వద్ద నిర్వహింపబడే ఆటలపోటీల వద్ద జరిగే ప్రమాదాలకుగానీ, కార్మిక బృందాలు సమిష్టిగా సినిమాలు చూడటానికి వెళ్ళడం వంటి సాంఘిక - సాంస్కృతిక కార్యకలాపాల సందర్భంగా జరిగే ప్రమాదాలకు గానీ - నష్టపరిహారం చెల్లించే ఏర్పాటు చేయబడింది.

## వైద్య సౌకర్యాలు

క్రొత్తగా అనేక ఆరోగ్య కేంద్రాలు వందలాది వైద్య స్థానాలు ఏర్పాటు చేయబడ్డాయి. ప్రతి 500 మంది 520 మంది ప్రజలకు ఒక్క డాక్టరు వుండేటట్లుగా డాక్టర్ల సంఖ్యను పెంపొందించడం 1980 నాటికి పూర్తి చెయ్యాలని తలపెట్టారు.

ఆర్థిక సంక్షోభం బెడదలేకపోవడం, ఉద్యోగాలకు భద్రత, స్థిరమైన ధరలు కారణంగా సోషలిస్టు వ్యవస్థలోని కష్టజీవులు - తాము పెంపొందించే వుత్పత్తి యొక్క ఫలితాలను ప్రత్యక్షంగా తామే అనుభవించేందుకు జర్మన్ ప్రజాతంత్ర రిపబ్లిక్ ప్రభుత్వం చేపడుతున్న సమగ్రమైన సాంఘిక చర్యలవల్ల అవకాశం కలుగుతోంది.

1973 సెప్టెంబరు మొదటితేదీన పాఠశాల ముగించినవారిలో 99 శాతం—సుమారు రెండు లక్షలు—ఏదో ఒక వృత్తి శిక్షణ పొందేందుకు అప్రెంటిసులుగా చేరారు. ప్రజల పరిస్థితులను, జీవన పరిస్థితులను పెంపొందించేందుకు దోహద పడుతుంది.

ఒక 1973 లోనే వివిధ పాఠశాలలకు 11,500 ప్రొజెక్టర్లు, 13,740 ఓవర్ హెడ్ ప్రొజెక్టర్లు, 26,000 దేశ పటాలు, 35,000 ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పరిశోధనా పరికరాలు సరఫరా చేయబడినాయి.

వృద్ధులకు ఆశ్రయం కల్పించే కేంద్రాలలో 1974 లో 3,315 మందికి అదనంగా స్థానాలు కల్పించదలపెట్టారు. అంతేగాక అలాంటి కేంద్రాలన్నిటిలో అధునాతన సౌకర్యాలు కల్పించాలనికూడా నిర్ణయించారు.

సగటున ఒక్కొక్క ఆవు ఏడాదికిఇచ్చే పాలదిగుబడి ఇటీవల బాగా పెరిగి 3,625 కిలోగ్రాములకు చేరింది.

18 సంవత్సరాలలోపు యువతీ యువకులందరికీ ఏడాదికొకసారి వైద్యపరీక్ష చేసే ఏర్పాటు చేయబడింది.